# విద్యార్థి వెలుగు

Volume VIII - Issue VI - June 2025



## శిష్యత్వం

# దేశానికి శిష్యులు కావాలి

"మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులుగా చేయుడి" (మత్తయి 28:19). యేసుక్రీస్తు పునరుత్థానం తరువాత, ఆయన తన శిష్యులకు ఇచ్చిన చివరి ఆజ్ఞ. ఇది కేవలం ఒక సూచన కాదు; శిష్యులకు ఇవ్వబడిన నిర్దిష్టమైన ఆజ్ఞ.

కొత్త నిబంధనలో 'శిష్యుడు' అనే పదం దాదాపు 260 సార్లు వాడబడింది. అదే 'క్రైస్తవుడు' అనే పదం మూడుసార్లు, 'విశ్వాసి' అనే పదం కింగ్ జేమ్స్ బైబిల్ ప్రకారం రెండు సార్లు మాత్రమే కనిపిస్తుంది. దీనిని బట్టి చూస్తే సంఘం యొక్క లక్ష్యం క్రైస్తవులను లేదా విశ్వాసులను తయారు చేయడం కాదు, యేసుక్రీస్తుకు శిష్యులను తయారు చేయడమే అని స్పష్టంగా అర్థమవుతుంది.

కానీ నేటి తరంలో శిష్యత్వం గురించి సరైన బోధన, అనుసరణ, శిక్షణ చాలా చోట్ల కనబడడంలేదు. అందుకే, మనం దేవుని యొక్క ఉద్దేశాలను గ్రహించాలి. శిష్యత్వం యొక్క నిజమైన అర్థాన్ని తెలుసుకోవాలి.

శిష్యత్వం అంటే యేసయ్యను ప్రభువుగా అంగీకరించడం, ఆయన దగ్గర నేర్చుకోవడం, ఆయనను అనుసరించడం, ఆయనను వ్యక్తిగతంగా అనుభవించడం వంటి ముఖ్యమైన అంశాలతో నిండి ఉంది. శిష్యుడిగా ఉండడం అంటే కేవలం కొన్ని నియమాలను అనుసరించడానికి తీసుకునే నిర్ణయం కాదు; యేసుక్రీస్తు అనే వ్యక్తిని ప్రతి విషయంలో అనుసరించడానికి తీసుకునే దీర్ఘకాలిక నిర్ణయం.

యేసుక్రీస్తు ఒక వ్యక్తిని శిష్యుడిగా ఉండటానికి పిలిచాడంటే, అది తాత్కాలిక పిలుపు కాదు, నిత్యత్వానికి సంబంధించిన పిలుపు. యోహాను 15:4లో చెప్పినట్లుగా, ఆయనలో నిలిచి ఉండమని పిలుస్తాడు. నిలిచి ఉండి ఫలాలు ఫలించాలని పిలుస్తాడు. పరిశుద్ధంగా జీవిస్తూ, పరిపూర్ణత వైపు అడుగులు వేయమని పిలుస్తాడు. లోకానికి ఉప్పుగా, వెలుగుగా ఉండి ప్రపంచాన్ని ప్రభావితం చేయాలని పిలుస్తాడు. సువార్తను ప్రకటించడానికి, లోకం విషయంలో మరియు స్వయం విషయంలో చనిపోవడానికి, ఆయన కోసం శ్రమలను, నిందలను అనుభవించడానికి సిద్ధంగా ఉండాలని పిలుస్తాడు. క్రీస్తు కోసమే జీవించడానికి, మన జీవితాల ద్వారా తండ్రి అయిన దేవునికి మహిమ తీసుకురావడానికి మనల్ని అర్పించుకోవాలని ఆయన పిలుస్తాడు (యోహాను 15:8).

అయితే, కొంతమంది శిష్యత్వపు నియమాలను బలహీనపరిచే పనిలో ఉన్నారు. కొద్దిమంది తాత్కాలిక శిష్యులుగా ఉంటున్నారు, ఎలాంటి కష్టం లేకుండా త్వరగా లేదా వెంటనే శిష్యులు కావాలని తొందరపడుతున్నారు. మరికొందరు పాపులారిటీ, అధికారం, పేరు ప్రఖ్యాతలు, స్వలాభం కోసం యేసు శిష్యులుగా మారుతున్నారు. ఇది నిజమైన శిష్యత్వం కాదు. ఇలాంటి నకిలీ బోధనల విషయంలో, నకిలీ శిష్యుల విషయంలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి.

యుఇయస్ఐ పరిచర్యను ప్రారంభించిన మన పితరులు యేసుక్రీస్తుకు నిజమైన శిష్యులుగా ఉండడానికి ఇష్టపడ్డారు మరియు అలాగే జీవించారు. కళాశాల ప్రాంగణాలను, మన దేశాన్ని ప్రభావితం చేసే యేసుక్రీస్తు శిష్యులుగా విద్యార్థులను తయారు చేయాలనే మిషన్‌ను మనకు అందించారు.

మనం నిజమైన శిష్యులుగా జీవించడంలో ఎప్పుడూ విఫలం కాకూడదు. నిజమైన శిష్యులను తయారుచేసే పనిని నిర్లక్ష్యం చేయకుండా అనేకమంది విద్యార్థులను నిలువబెట్టడంలో మనం కృషి చేయాలి.

భారతదేశానికి నిజమైన శిష్యులు అవసరం. క్రీస్తును తమ జీవితాల్లో ప్రభువుగా ప్రతిష్టించుకుని, ధైర్యంగా ఆయన కోసం జీవించే నిజ శిష్యుల సమూహాలను దేవుడు మన దేశంలో తయారు చేయాలని ప్రార్థిద్దాం. అలాంటి శిష్యులను తీర్చిదిద్దే పరిచర్యగా యుఇయస్ఐ మన దేశానికి ఎంతో అవసరం.

– కట్టా రవి కుమార్

# విద్యార్థి వెలుగు

Vol. VIII - Issue VI - June 2025

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

**EDITORIAL BOARD**

Editor and Publisher:
Mr. Dasari Rajesh, Hyderabad

Managing Editor:
Mr. K. John Bhushanam, Cyberabad

UESI PT TG Branch Sec.:
Mr.V Rajendra Prasad, Hyderabad

**Members:**
Mr. S. Simon, Hyderabad
Mrs. P. Raja Kumari, Hyderabad
Mr. S. Jayaraju, Hyderabad
Mr. Raja Sekhar Addanki, Cyberabad
Mrs. L.Vinodha, Sangareddy

**CONTACT DETAILS**

The Editor, Vidyarthi Velugu
UESI Publication Trust - Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village,
Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Ph: 9491595765
Email: editorvv2018@gmail.com

**SCAN THE QR CODE TO SUBSCRIBE VIDYARTHI VELUGU MAGAZINE**

SCAN ME

**Annual (Hard+Soft copy)**
Students -150/-
Graduates - 300/-

**For 3 Years (Hard+Soft copy)**
Students - 450/-
Graduates - 900/-

**Life (10 Years - Hard+Soft copy)**
Students & Graduates - 2000/-

**Overseas (10 Years - Soft copy)**
Students & Graduates - 2000/-

**Publication Trust Account**

| | |
|---|---|
| Name | - UESI PUBLICATION TRUST |
| Bank | - Canara Bank |
| A/C No | - **0624101037187** |
| Branch | - Pragathinagar |
| IFSC code | - CNRB0004173 |

Kindly inform the office after depositing amount.
Ph. **8985482388**

**Please furnish the following details**

Address, Pincode, Phone Number, Mail Id, Payment Transaction Details

**THEMES:**

| | |
|---|---|
| July | - Living in Hope |
| Aug | - Living as a Light |
| Sep | - Grow in Character |

Please send your writeups on or before **10th of every month** to editorvv2018@gmail.com

## పాఠకుల స్పందన ...

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు మనవి. ప్రతినెల వివిలో వచ్చే ఆర్టికల్స్ మీద మీ సూచనలను, నేర్చుకున్న విషయాలు **పాఠకుల స్పందన ...** కు editorvv2018@gmail.com లేక 9491595765 (వాట్సాప్) ద్వారా పంపించగలరు.

## విషయ సూచిక

| | |
|---|---|
| శిష్యత్వం | 4 |
| శిష్యత్వం - సవాళ్లు | 7 |
| ప్రపంచాన్ని ప్రభావితం చేద్దాం | 10 |
| దేవుని చిత్తం చిక్కు ప్రశ్న కాదు | 13 |
| సువార్త - న్యాయం | 17 |
| పోరాటాలలోనే బలం దాగి ఉంది! | 20 |
| తబితా | 22 |
| రెవరెండ్ చార్లెస్ మీడ్ | 26 |

## విజ్ఞప్తి

ప్రియమైన విద్యార్థి వెలుగు పాఠకులకు రక్షకుడు, ప్రభువునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ క్రింది విషయాలు గమనించాలని కోరుతున్నాము.

1. అడ్రస్ మారినా, మ్యాగజైన్ రాకపోయినా, నూతన సబ్‌స్క్రిప్షన్, రెన్యువల్ కొరకు ఆఫీస్ స్టాఫ్ బ్రదర్ డి.సాయి కుమార్ (79933 97630) ను సంప్రదించగలరు.
2. విద్యార్థి వెలుగు పోస్టల్ అవాంతరాలు లేకుండునట్లు, అందరూ చదివి ఆత్మీయ మేలు పొందేటట్లు భారంగా ప్రార్థించండి, ప్రోత్సహించండి.

ప్రతి నెల ప్రార్థనాంశాలు **10**వ తారీఖు లోపల ఇ.యు, ఇ.జి.యఫ్‌కు చెందిన ప్రాముఖ్యమైన రెండు స్తుతి మరియు రెండు ప్రార్థనాంశాలను మాత్రమే వివి ప్రేయర్ పాయింట్స్ లింక్ ద్వారా పంపించగలరు. రచనపై ఆసక్తి కలిగిన వారు తమ వ్యాసములు, కథలు, కవితలు editorvv2018@gmail.com కు పంపించగలరు.

- విద్యార్థి వెలుగు ఎడిటోరియల్ బోర్డ్



# శిష్యత్వం

జీవితంలో ప్రతి ఒక్కరు ఏదో ఒక దశలో ఉన్నతమైన వ్యక్తుల నుండి, లేదా ఉన్నతమైన ఆశయాల నుండి నేర్చుకోవాలని, వారి అడుగు జాడల్లో నడవాలని కోరుకుంటారు. ఇది చాలా సహజమైన విషయం. ప్రతి రంగంలోనూ ఈ కోరిక స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక విద్యార్థి తన ఉపాధ్యాయుడిని, ఒక శిల్పి తన గురువును, ఒక సంగీతకారుడు తన మాస్టర్‌ను గౌరవించి అనుసరిస్తాడు. గురువు యొక్క జ్ఞానం, అనుభవం శిష్యునికి మార్గదర్శకంగా నిలుస్తాయి.

అయితే, మనకు నిజమైన, నిత్యమైన మార్గదర్శకత్వాన్ని ఇవ్వగల మహోన్నతుడు ఒక్కరే ఉన్నారు. ఆయనే యేసుక్రీస్తు. యేసుక్రీస్తు మనకు అత్యంత ముఖ్యమైన గురువుగా నిలుస్తాడు. ఆయన బోధలు మరియు ఆయన జీవితం మనకు అత్యున్నత ఆదర్శం. ఆయన మార్గదర్శనంతో, మనం దేవుని ఉచిత బహుమతిని పొంద గలుగుతాం. ఈ అద్భుతమైన బహుమతి ఏదో కాదు; అదే రక్షణ. రక్షణ పొందడం అనేది యేసుక్రీస్తు మీద విశ్వాసం ఉంచడం ద్వారా సాధ్యమవుతుంది. ఇది మన క్రైస్తవ జీవితానికి తొలి మెట్టు, ఒక అద్భుతమైన ఆరంభం.

కానీ, దేవుని పిలుపు రక్షణతోనే ఆగిపోదు. ఇది ఒక ఆరంభం మాత్రమే. రక్షణ పొందిన ప్రతి విశ్వాసి కూడా కేవలం విశ్వాసిగా ఆగిపోకుండా, శిష్యునిగా మారడానికి పిలువబడ్డాడు.

## 1. శిష్యత్వం అంటే ఏమిటి?

సాధారణంగా, శిష్యుడు అంటే ఒక గురువును అనుసరించే వ్యక్తి. కానీ క్రైస్తవ పరిభాషలో, శిష్యత్వం అంటే యేసుక్రీస్తును మన గురువుగా అంగీకరించి, ఆయన అడుగుజాడల్లో నడవడానికి మన జీవితాలను అంకితం చేయడం. ఇది కేవలం యేసు నందు విశ్వసించడమే కాదు, ఆయన ఆజ్ఞలను పాటించడం, ఆయనవలె జీవించడం కూడా. వేరే మాటల్లో చెప్పాలంటే, శిష్యత్వం అనేది క్రీస్తుతో ఒక వ్యక్తిగత సంబంధం, ఆయన బోధనలకు విధేయులై, ఆయన ప్రేమను ఇతరులకు పంచడమే నిజమైన శిష్యత్వం.

చాలామంది క్రైస్తవులు శిష్యులుగా పిలువ బడటానికి ఇష్టపడరు. ఎందుకంటే శిష్యత్వం అనేది ఒక బాధ్యతతో కూడుకున్నది. నిజమైన శిష్యుడు తన జీవితాన్ని క్రీస్తుకు అంకితం చేస్తాడు, తన సొంత కోరికలను, ప్రణాళికలను విడిచిపెట్టి క్రీస్తు చిత్తానికి లోబడి జీవిస్తాడు.

ఉదాహరణకు, ఒక వ్యక్తి యేసును తన రక్షకునిగా అంగీకరించినప్పుడు, అతను ఒక విశ్వాసి అవుతాడు. కానీ అతను యేసును తన గురువుగా అంగీకరించి, ఆయన మార్గంలో నడవడానికి నిర్ణయించుకున్నప్పుడు, అతను ఒక శిష్యుడు అవుతాడు.

## 2. శిష్యత్వానికి లేఖనానుసారమైన ఉదాహరణలు

బైబిల్లో శిష్యత్వానికి సంబంధించిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పుడు మనం పరిశీలిద్దాం:

- **మత్తయి 28:19-20:** “కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఆజ్ఞాపించిన వాటన్నిటిని గైకొనమని వారికి బోధించుడి.” ఈ వచనం శిష్యత్వం ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. యేసు తన అనుచరులను ప్రపంచమంతటా వెళ్లి ప్రజలను శిష్యులుగా చేయమని ఆజ్ఞాపించాడు.
- **లూకా 14:27:** “ఎవడు తన సిలువను మోసికొని నన్ను వెంబడింపడో వాడు నా శిష్యుడు కానేరడు.” ఈ వచనం శిష్యత్వం లో ఉన్న సవాలును తెలియజేస్తుంది. యేసును అనుసరించడానికి మనం కష్టాలను, బాధలను కూడా భరించవలసి ఉంటుంది.
- **యేసు శిష్యులు:** యేసు తన జీవితకాలంలో అనేకమందిని శిష్యులుగా చేసుకున్నాడు. పేతురు, యోహాను, యాకోబు వంటి శిష్యులు తమ జీవితాలను యేసు కోసం అంకితం చేశారు. వారు ఆయనతో కలిసి ప్రయాణం చేశారు, ఆయన బోధనలను విన్నారు, ఆయన అద్భుతాలను చూశారు. చివరికి వారు ఆయన సువార్తను ప్రపంచానికి చాటి చెప్పారు.

## 3. శిష్యత్వంలో ముఖ్యమైన నిబద్ధతలు

ఒక వ్యక్తి క్రీస్తు శిష్యునిగా ఉండాలంటే కొన్ని ముఖ్యమైన నిబద్ధతలను కలిగి ఉండాలి:

- **యేసును అనుసరించడం:** శిష్యత్వంలో మొదటి, ముఖ్యమైన నిబద్ధత యేసును అనుసరించడం. అంటే ఆయన అడుగు జాడల్లో నడవడానికి, ఆయనవలె జీవించ డానికి ప్రయత్నించడం.
- **ఆయన బోధనల నుండి నేర్చుకోవడం:** యేసు బోధనలను శ్రద్ధగా వినాలి, వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి, వాటిని మన జీవితాల్లో ఆచరించాలి.
- **ఆయన సూత్రాలను అనుసరించడం:** యేసు ప్రేమ, దయ, క్షమాపణ వంటి సూత్రాలను

బోధించాడు. మనం ఆ సూత్రాలను మన జీవితాల్లో అనుసరించాలి.

## 4. శిష్యత్వంలోని సవాళ్లు, త్యాగాలు

శిష్యత్వం అనేది సులువైన మార్గం కాదు. ఇది అనేక సవాళ్లను, త్యాగాలను కలిగి ఉంటుంది. యేసును అనుసరించడానికి మనం మన సొంత కోరికలను, ప్రణాళికలను విడిచిపెట్టవలసి ఉంటుంది. కొన్నిసార్లు మనం ఇతరుల నుండి వ్యతిరేకతను, హింసను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది.

యేసుక్రీస్తు చెప్పినట్లుగా, “ఎవడు తన ప్రాణము ను రక్షించుకొనగోరునో వాడు దానిని పోగొట్టు కొనును; నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును” అంటే, యేసును అనుసరించడానికి మనం మన ప్రాణాలను కూడా అర్పించడానికి సిద్ధంగా ఉండాలి. మన స్వార్థాన్ని, సుఖాలను వదులు కోవలసి వస్తుంది.

ఉదాహరణకు, ఒక వ్యక్తి యేసు కోసం తన ఉద్యోగాన్ని, స్నేహితులను, కుటుంబాన్ని కూడా విడిచిపెట్టవలసి రావచ్చు. ఇది చాలా కష్టమైన నిర్ణయం కావచ్చు, కానీ నిజమైన శిష్యుడు యేసు కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉంటాడు.

## 5. శిష్యత్వాన్ని ఎలా మెరుగుపరుచుకోవాలి?

మన శిష్యత్వాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి మనం కొన్ని పనులు చేయాలి. అవి:

- **ప్రార్థనలో గడపడం:** ప్రార్థన అనేది దేవునితో మాట్లాడటానికి, ఆయనతో సంబంధం కలిగి ఉండటానికి ఒక మార్గం. మనం క్రమం తప్పకుండా ప్రార్థన చేయాలి. ప్రతిరోజూ కొంత సమయం దేవునితో గడపడం ద్వారా ఆయన చిత్తాన్ని తెలుసుకోవచ్చు.
- **బైబిల్ చదవడం:** బైబిల్ దేవుని వాక్యం. మనం బైబిల్‌ను క్రమం తప్పకుండా చదవాలి. దేవుని మాటలను అర్థం చేసుకోవడం ద్వారా మన జీవితాలను సరిదిద్దుకోవచ్చు.
- **సంఘంలో పాల్గొనడం:** సంఘం అనేది విశ్వాసుల సమాజం. మనం సంఘంలో పాల్గొనడం ద్వారా ఇతరులతో సహవాసం చేయవచ్చు, ఒకరినొకరు ప్రోత్సహించు కోవచ్చు. తోటి విశ్వాసులతో కలిసి దేవుని ఆరాధించడం, సేవ చేయడం మన విశ్వాసాన్ని బలపరుస్తుంది.
- **మెంటార్‌ను కలిగియుండడం:** ఒక అనుభవజ్ఞుడైన విశ్వాసి నుండి మనం శిష్యత్వం గురించి నేర్చుకోవచ్చు. వారి అనుభవం మనకు మార్గనిర్దేశం చేస్తుంది.
- **సేవ చేయడం:** ఇతరులకు సేవ చేయడం ద్వారా మనం క్రీస్తు ప్రేమను పంచుకోవచ్చు. మన పొరుగువారికి సహాయం చేయడం ద్వారా దేవుని ప్రేమను వ్యక్తపరచవచ్చు.

## ముగింపు

శిష్యత్వం అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఇది మనల్ని సవాళ్లకు గురి చేస్తుంది, త్యాగాలు చేయమని కోరుతుంది. కానీ, నిజమైన శిష్యరికం మనకు సంతోషాన్ని, నెమ్మదిని ఇస్తుంది. కాబట్టి, మనమందరం క్రీస్తు శిష్యులుగా జీవించడానికి ప్రయత్నిద్దాం. ఆయన మార్గంలో నడుస్తూ, ఆయన ప్రేమను ఇతరులకు పంచుదాం.

యేసుక్రీస్తు చెప్పినట్లుగా, “ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించు కొని, తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపవలె ను.” మన స్వంత కోరికలను, ప్రణాళికలను విడిచిపెట్టి యేసుక్రీస్తు చిత్తానికి లోబడటమే నిజమైన శిష్యత్వం. ఈ మార్గంలో నడవడానికి మన మందరం సిద్ధంగా ఉందాం. దేవుడు మనకు తోడుగా ఉండి నడిపించును గాక!

– పి.నరేందర్, సంగారెడ్డి





# శిష్యత్వం - సవాళ్లు

శిష్యత్వం అనేది ఒక గొప్ప పిలుపు. ఇది కేవలం యేసుక్రీస్తును అనుసరించడం మాత్రమే కాదు, ఆయన వలె జీవించడానికి నిరంతరం ప్రయత్నించడం కూడా. అయితే, ఈ మార్గం సవాళ్లతో నిండి ఉంటుంది. ఈ సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో, నిజమైన శిష్యులుగా ఎలా ఎదగాలో మనం ఇప్పుడు చూద్దాం.

### 1) శిష్యత్వం - అవగాహన

యేసుక్రీస్తు శిష్యుడిగా ఉండటం అంటే ఆయనతో కలిసి జీవించడం, ఆయన మాటలు వినడం, ఆయన కార్యాలను చూడటం, నేర్చుకున్న వాటికి విధేయత చూపడం. ఈ క్రమంలో మనం క్రీస్తును పోలి ఉండటానికి ప్రయత్నించాలి. ఈ అవగాహన మనకు చాలా అవసరం. ఈ రోజుల్లో చాలామంది మంచి వరాలు, తలాంతులు కలిగి ఉండటం, నాయకత్వం వహించడం, వాక్య బోధ చేయడం, పాటలు పాడటం, ఆర్థికాభివృద్ధి సాధించడం, జ్ఞానవంతులుగా ఉండటం వంటి వాటిలో రాణించడాన్నే మంచి శిష్యత్వం అనుకుంటున్నారు. ఇది ఒక భ్రమ మాత్రమే.

నిజమైన శిష్యత్వం అనేది ఆత్మ వరాలను బట్టి కాదు, ఆత్మ ఫలాలను బట్టి ఉంటుంది. మన హృదయంలో దాగి ఉండి, మన ప్రవర్తనను నడిపించే విశ్వాసం, ప్రేమ, నిరీక్షణ అనే లక్షణాలే నిజమైన కొలమానం. ఈ మూడు లక్షణాలు మనలో ఉంటే, మనం క్రీస్తును పోలి నడుచుకుంటాం. వీటిలో ఏదైనా లోపిస్తే, మన ప్రవర్తన ఆత్మీయంగా కాకుండా శరీరానికి సంబంధించిన కోరికల వైపు వెళ్తుంది. ఉదాహరణకు, మనం శిష్యులుగా ఎదుగుతున్నామో లేదో తెలుసుకోవడానికి 1 కొరింథీ 13వ అధ్యాయం లో ఉన్న ప్రేమను, హెబ్రీ 11వ అధ్యాయంలో ఉన్న విశ్వాసం/నిరీక్షణను పరిశీలించాలి.

### 2) శిష్యత్వం - సమయం

శిష్యులుగా ఎదగాలను కుంటే, దానికి సమయం కేటాయించడం చాలా ముఖ్యం. విలియం డి. లాంగ్‌స్టాఫ్ రాసిన “టేక్ టైమ్ టు బి హోలీ.” అనే పాటను మనం గుర్తు చేసుకోవాలి. ఆ పాటలోని కొన్ని ముఖ్యమైన మాటలు:

“ప్రభువుతో మాట్లాడటానికి సమయం కేటాయించు”

“ప్రపంచం పరుగులెడుతున్నా, నువ్వు మాత్రం సమయం తీసుకో”

"యేసుతో ఒంటరిగా, రహస్యంగా సమయం గడుపు"

"యేసును చూస్తూ ఉంటే, ఆయనలా మారుతావు"

"నీ స్నేహితులు నీ ప్రవర్తనలో యేసును చూడాలి"

నేటి రోజుల్లో చాలామంది "నేను చాలా బిజీగా ఉన్నాను, నాకు సమయం లేదు" అని గర్వంగా చెబుతున్నారు. యేసుప్రభువు తన 12 మంది శిష్యులను పిలిచినప్పుడు, వారు తమ పడవలను, చేపలను, తమ పనులను విడిచిపెట్టారు. వారు తమ సమయాన్ని, బాధ్యతలను, సంబంధాలను కొత్తగా ఏర్పరచుకున్నారు. మనం వాక్యం వినడానికి, చదవడానికి, ప్రార్థించడానికి, నేర్చుకోవడానికి కనీసం కొంత సమయం మొబైల్ ఫోన్‌ను, ఆన్‌లైన్ ఆటలను విడిచిపెట్టకపోతే ఎలా శిష్యుల మవుతాం?

### 3. శిష్యత్వం – సంబంధాలు

యేసుక్రీస్తు ఈ లోకంలో ఉన్నప్పుడు, ఆయన శిష్యులు ఒక గుంపుగా ఉంటూ, ప్రభువుతో గడుపుతూ, ఆయన ఇచ్చిన పనులు కలిసి చేస్తూ శిష్యులుగా ఎదిగారు. అదేవిధంగా, మనమందరం శిష్యులుగా ఎదగడానికి ఒకరితో ఒకరు సంబంధాలు కలిగి ఉండటం చాలా అవసరం. మన ఐసిఇయూ, ఇఏియఫ్ సమూహాలలో తోమా వంటి మేధావులు, పేతురు వంటి ఉత్సాహవంతులు, యోహాను వంటి అంకితభావం కలిగినవారు ఉంటారు. మనమందరం ఒకరి నొకరు అంగీకరించాలి, ప్రేమించాలి. వారి తల్లిదండ్రులు, బంధువులు మనకు కూడా బంధువులవుతారు.

ఈ వాక్య ధ్యానం, సహవాసం ద్వారా, మనం ఒకరి సానుకూల, ప్రతికూల అంశాల నుండి అనేక విషయాలు నేర్చుకుంటాం. ఇతరులు ప్రభువును ఎలా అంగీకరించి ఆయన కోసం జీవిస్తున్నారో వారి జీవితాల ద్వారా మనం తెలుసుకుంటాం. ఈ సహవాసం ద్వారానే ప్రభువు మనలను మంచి శిష్యులుగా మారుస్తాడు. ఈ ప్రక్రియలో ప్రభువు కొన్ని గాయాలను కూడా అనుమతిస్తాడు. మన సహవాసంలో ఎవరైనా మనలను తెలిసో తెలియకో బాధపెడితే, మనం వెంటనే నిరుత్సాహపడి సహవాసానికి దూరం కాకూడదు. ఈ సహవాసంలో ప్రభువు, ఆయన వాక్యం మాత్రమే పరిపూర్ణంగా ఉంటాయి. మనలో ప్రతి ఒక్కరిలో కొన్ని లోపాలు ఉంటాయి. మనమందరం అన్ని విషయాల్లో ప్రభువు వలె ఎదగాలని ప్రార్థించడం, నేర్చుకోవడం, నేర్పించడం మన బాధ్యత. చిన్నగా ఎదిగేవారిని, బలహీనులను సహించగలిగితేనే మనం నిజమైన శిష్యులుగా ఎదుగుతాం.

### 4. శిష్యత్వం – క్రమశిక్షణ

శిష్యునిగా ఎదగడానికి క్రమశిక్షణ చాలా అవసరం. మనం నిరంతరం అభ్యసిస్తూ ఉండాలి. మనకు సమయం ఉన్నప్పుడు, సంతోషంగా ఉన్నప్పుడు వాక్య ధ్యానం, ప్రార్థన, సహవాసంలో కొనసాగాలి. చిన్న ఆటంకాలు ఎదురైనప్పుడు వాటిని విస్మరించకూడదు. మనం రక్షణ పొందిన తొలి రోజుల్లో వీటి ప్రాముఖ్యతను ఎంతగా గుర్తించామో, మన జీవితాంతం కూడా వాటిని అంతే ముఖ్యమైనవిగా భావించాలి.

### శిష్యునిగా ఎదగడానికి అవసరమైన మూడు ముఖ్యమైన విషయాలు

- **పారదర్శకత:** మన వ్యక్తిగత విషయాలు, ఉద్దేశ్యాల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే నిజాయితీగా సమాధానం చెప్పగలగాలి. మనలో రహస్యాలు, కుతంత్రాలు, స్వార్థపూరిత ఆలోచనలు ఉండ కూడదు. మనసు విప్పి అందరితో పంచుకోవాలి, ప్రేమతో స్పందించాలి. నేను అందరికంటే

గొప్పవాడిని, నన్ను ఎవరూ ప్రశ్నించకూడదు అనే ఆలోచన రాకూడదు.

- **జవాబుదారీతనం:** యేసుప్రభువు అప్పగించిన పనిని చేసిన తర్వాత శిష్యులు దాని గురించి నివేదిక ఇచ్చారు. ఆదిమ సంఘంలో విశ్వాసులు అపొస్తలులకు, సంఘ నాయకులకు లోబడ్డారు. నేటి రోజుల్లో ఇయు, ఇజియఫ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు, స్టాఫ్ ఒకరికొకరు జవాబుదారీగా ఉండాలి. కమిటీ ఏదైనా ఒక బాధ్యతను అప్పగిస్తే, అది ప్రభువు నుండి వచ్చిందని ప్రార్థనతో ఆలోచించి పనిచేయాలి.
- **మెంటార్ల సహాయం:** "ఇనుము ఇనుమును పదును పెడుతుంది" అన్నట్లుగా, ఒక పెద్ద శిష్యుడు మరొక చిన్న శిష్యుడిని గొప్పవానిగా తయారు చేస్తాడు. నిజమైన శిష్యులుగా ఎదగాలనుకునే వారు తప్పకుండా మెంటార్స్ సహాయం తీసుకోవాలి. సలహా, సరిదిద్దుబాటు, హెచ్చరికలు, ప్రోత్సాహాలు పొందాలి. శిష్యులుగా ఉండటానికి వినయం, పారదర్శకత అవసరం, అలాగే మెంటార్స్‌గా ఉండటానికి కాన్ఫిడెన్షియాలిటీ, ప్రేమ, శ్రద్ధ అవసరం.

## 5) శిష్యత్వం - పరిచర్య

ఆధ్యాత్మికంగా, జ్ఞానపరంగా మనం ఎదగడానికి ఇంతకుముందు చర్చించిన అంశాలన్నీ మనకు ఉపయోగపడతాయి. అయితే, మన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడానికి ఒక అవకాశం కావాలి. ఇతరులకు సేవ చేయడం ద్వారా మన నిజమైన సామర్థ్యాన్ని తెలుసు కోగలుగుతాం. కాబట్టి, శిష్యుడు నిజమైన పరిచారకు డిగా ఉండాలి.

మన సమయాన్ని, మనకున్న వనరులను ఇతరుల కోసం వెచ్చిస్తున్నప్పుడు, మన జీవితాలు క్రీస్తు పరిమళాన్ని వెదజల్లుతాయి. యూఇయఎస్ఐ పరిచర్యలో దేవుని కృపతో మనకు ఈ అవకాశం పుష్కలంగా ఉంది. విద్యార్థుల పరిచర్యలో వారి అనుభవాలను, సమస్యలను తెలుసుకొని ఆచరణాత్మక సలహాలు ఇవ్వడానికి, ప్రార్థన చేయడానికి, బోధించడానికి మనకు అవకాశం ఉంది. నిజమైన శిష్యునిగా మనం పరిచర్య చేస్తూ ముందుకు సాగిపోదాం!

## ముగింపు

నిజమైన శిష్యత్వం అనేది మన జీవితాన్ని పూర్తిగా ప్రభావితం చేసే పిలుపు. ఇది కేవలం ఒక మతపరమైన బాధ్యత కాదు; అది మన వ్యక్తిత్వాన్ని, సంబంధాలను, జీవిత ధోరణిని పూర్తిగా మార్చే బలమైన ఆత్మీయ మార్గం. క్రీస్తును అనుసరించాలంటే కేవలం ఆయనను గూర్చి తెలుసుకోవడం సరిపోదు - ఆయన లాగా జీవించడం అవసరం. ఈ మార్గంలో సమయం కేటాయించడం, బలమైన సంబంధాలను నిర్మించడం, క్రమశిక్షణతో జీవించడం, సేవా దృక్పథంతో ముందుకు సాగడం తప్పనిసరి.

ఈ మార్గం సులభమైనది కాదు. ఇది ప్రతి రోజూ మన మనస్సుతో, శరీరంతో, ప్రపంచపు ఆకర్షణలతో పోరాడే మార్గం. కానీ ప్రతి చిన్న విజయం మనలో ఆత్మీయ గెలుపుగా నిలిచిపోతుంది. ప్రతి చిన్న సేవా పరిచర్య, ప్రతి ధ్యానం, ప్రతి ప్రార్థన మనలను క్రీస్తుకు దగ్గర చేస్తుంది. ఇది ఒక వ్యక్తిగత మార్గమే అయినా, ఒంటరిగా కాదు - ప్రభువు మన వెంట ఉన్నాడు, సహవాసం మనతో ఉంది.

మన సమయాన్ని, వనరులను ప్రభువు కోసం, ఇతరుల కోసం వినియోగిస్తూ, నిత్యం ఎదుగుతూ, ఒక నిజమైన శిష్యుడిగా జీవించడానికి మనం సిద్ధంగా ఉండాలి. అప్పుడే, దేవుని మహిమ కోసం మనం నడిచే ఈ శిష్యత్వ మార్గంలో, ప్రతి అడుగూ ఆశీర్వాదంగా మారుతుంది.

**- ఎన్.సిహెచ్.వి. కృష్ణమాచార్యులు, చెన్నై**




# ప్రపంచాన్ని ప్రభావితం చేద్దాం

మారుతున్న ఈ ప్రపంచంలో నిజమైన, శాశ్వతమైన మార్పు అనేది ఒక ఉన్నతమైన లక్ష్యంతో జీవించే వ్యక్తులతోనే మొదలవుతుంది. యేసుక్రీస్తు శిష్యులుగా, మనం కేవలం ప్రేక్షకులుగా ఉండిపోకూడదు. మన విశ్వాసం ద్వారా జీవితాలను, సమాజాలను మార్చేందుకు మనం చురుకైన పాత్రను పోషించాలి. "శిష్యుడు" అనే పదానికి కేవలం మతపరమైన ప్రాముఖ్యత మాత్రమే కాదు, దాని వెనుక ఒక కార్యాచరణ ఉంది, ఒక స్థిరమైన నమ్మకం ఉంది, ఒక వ్యక్తిత్వం కూడా దాగి ఉంది.

శిష్యుడు అంటే ఒక నాయకుడి లేదా గురువు ఆలోచనలను, సూత్రాలను విశ్వసించి, వాటిని అనుసరిస్తూ, వాటి ప్రకారం జీవించడానికి నిరంతరం ప్రయత్నించే వ్యక్తి. యేసుక్రీస్తు అనుచరులుగా, మన చుట్టూ ఉన్న ఈ ప్రపంచంలో ఒక అర్థవంతమైన ప్రభావాన్ని చూపాలని మనం పిలువబడ్డాం. ఈ ప్రభావం కేవలం గొప్ప పనులు చేయడానికి లేదా స్మారక విజయాలు సాధించడానికి మాత్రమే పరిమితం కాదు. మన దైనందిన జీవితంలో మనం చేసే చిన్న పనుల్లో కూడా ఈ ప్రభావం అనేది కనిపిస్తుంది. అయితే ఆ విధంగా జీవించడం అంత సులభం కాదు, దానికి ఎంతో ఓర్పు, సహనం, నమ్మకం అవసరం.

## వ్యక్తిగత పరివర్తన

యేసుక్రీస్తు శిష్యత్వం కలిగించే లోతైన ప్రభావం మన వ్యక్తిగత పరివర్తనలో కనపడుతుంది. వ్యక్తులుగా మనం యేసును విశ్వసించినప్పుడు, మన జీవితాల్లో ఒక లోతైన, శాశ్వతమైన మార్పును అనుభవిస్తాం. ఇది ఒక నూతన లక్ష్యం, క్షమాపణ, నిస్వార్థమైన ప్రేమతో మనల్ని

నింపుతుంది. ఈ మార్పు మనల్ని ఒక కొత్త వ్యక్తిగా మారుస్తుంది, మన ఆలోచనలను, మన ప్రవర్తనను, మన ఉద్దేశ్యాలను మార్చివేస్తుంది. యేసుక్రీస్తును నమ్మడమంటే ఒక కొత్త జీవితాన్ని ప్రారంభించడమే. మనలోని పాత స్వభావం తొలగిపోయి, ఒక నూతన సృష్టిగా మనం రూపాంతరం చెందుతాం. ఇది మన జీవితానికి ఒక దివ్యమైన అర్థాన్ని ఇస్తుంది.

ఈ రూపాంతరం వ్యక్తిగతమైనదే అయినా, అది అక్కడితో ఆగదు. ఇది ఒక తరంగలా చుట్టుపక్కల వారిని కూడా ప్రభావితం చేస్తుంది. యేసుతో సంబంధం ఏర్పరచుకోవడానికి ఇతరులను ప్రోత్సహిస్తుంది. ఈ మార్పు ఎలా సాధ్య మవుతుంది? మనలోని నిజమైన మరియు వ్యక్తిగత, అంకిత భావం యేసుక్రీస్తును వెంబడించడం ద్వారా మన జీవితాల్లో ఈ మార్పును వస్తుంది. ఈ స్థాయి నుండి, రూపాంతరం చెందిన మన జీవితాలు ఇతరులను మార్చడం ప్రారంభిస్తాయి. కాబట్టి, మన జీవితాలను యేసుక్రీస్తుకి అంకితం చేసి, ఆయన శిష్యులుగా జీవిస్తూ, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కూడా మారుద్దాం.

## యేసు బోధనల వెలుగులో జీవితం

యేసు శిష్యులుగా మన దైనందిన జీవితంలో ఆయన బోధనలను ఆచరణలో పెట్టడానికి మనం పిలువబడ్డాం. నిజమైన శిష్యులుగా, మన చుట్టూ ఉన్నవారికి, ప్రత్యేకంగా అవసరంలో ఉన్నవారికి, నిరంతరం ప్రేమ, దయ, కరుణ చూపించడం మన కర్తవ్యం. అలా జీవించడం ద్వారా, మనం యేసు స్వభావాన్ని ప్రతిబింబిస్తాం, ఆయన ప్రేమను పంచుతాం మరియు సువార్త యొక్క మార్పు తెచ్చే శక్తిని ప్రపంచానికి ప్రదర్శిస్తాం.

అయితే, క్రీస్తు శిష్యుడు కావడానికి ఒక ముఖ్యమైన విషయం ఆత్మపరిశీలన చేసుకోవడం. మనం నిజంగా ఆయన బోధనల ప్రకారం జీవిస్తున్నామా అని ప్రశ్నించుకోవాలి. ఆయన వాక్యానుసారంగా జీవించడానికి మనం ఇష్టపడకపోతే, మన జీవితంలో మార్పు రాదు, మనం ఎవరినీ ప్రభావితం చేయలేం. ఆయన వాక్యానికి విధేయతతోనే మనం ఇతరులను ప్రభావితం చేయడం ప్రారంభమవుతుంది.

## గొప్ప ఆజ్ఞ

యేసుక్రీస్తు శిష్యులుగా మన జీవితానికి ఒక గొప్ప పరమార్థం ఉంది. అదేమిటంటే "గొప్ప ఆజ్ఞ". మత్తయి 28:19లో ఈ ఆజ్ఞ మనకు స్పష్టంగా ఇవ్వబడింది. "కావున మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి." దీని అర్థం ఏమిటంటే మనము సువార్తను ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ చేరవేయాలి. ప్రజలను క్రీస్తు శిష్యులుగా మార్చాలి.

ఈ గొప్ప ఆజ్ఞ క్రైస్తవ శిష్యత్వానికి పునాదిగా నిలుస్తుంది. ప్రతి ఒక్క విశ్వాసి తమ విశ్వాసాన్ని ఇతరులతో పంచుకోవాలని, అన్ని దేశాల ప్రజలను శిష్యులుగా చేయాలని ఇది నొక్కి చెబుతుంది. మన చుట్టూ ఉన్న ప్రపంచానికి దేవుని ప్రేమను పంచడమే మన ప్రధాన లక్ష్యం. మన మాటలు, చేతలు, ఆలోచనలు అన్నీ క్రీస్తు మార్గంలో ఉండాలని గుర్తుంచుకోవాలి. మనం చేసే ప్రతి పనిలోనూ దేవుని ఉద్దేశం నెరవేరేలా చూసుకోవాలి. ఇది మనందరి బాధ్యత.

అయితే, ఈ రోజుల్లో సువార్తను ప్రకటించడం అంత సులభం కాదు. సాంస్కృతిక ప్రతిఘటనలు, చట్టపరమైన ఆంక్షలు, సామాజిక ఒత్తిళ్లు మన విశ్వాసం గురించి బహిరంగంగా మాట్లాడటాన్ని గతంలో కంటే ఇప్పుడు మరింత కష్టతరం చేస్తున్నాయి. అయితే, క్రీస్తు శిష్యుడిగా మీ జీవితమే ఒక బహిరంగ సువార్తగా ఉండాలి. ఏ బాహ్య శక్తులు దానిని ఆపలేవు. ఒక్కోసారి మాటలు కూడా సరిపోవు, కానీ మన జీవితాలు బోధించగలవు. కాబట్టి మనం సువార్తను ప్రకటించడంలో తెలివైన పద్ధతులను అనుసరించాలి, వివేకంతో మరియు

ధైర్యంగా ఉండాలి. మన ప్రవర్తన ద్వారా, ప్రేమ ద్వారా, ఓదార్పు ద్వారా ఇతరులకు దేవుని గురించి తెలియజేయవచ్చు. మన జీవితమే ఒక సందేశంగా మారినప్పుడు, అది ఎంతో శక్తివంతంగా ఉంటుంది.

## లోకాన్ని ప్రభావితం చేయడం

యేసు శిష్యుల ప్రభావం కేవలం ఆధ్యాత్మిక విషయాలకే పరిమితం కాలేదు. చరిత్రను పరిశీలిస్తే, విద్య, వైద్యం, సామాజిక న్యాయం, సమాజ అభివృద్ధి వంటి అనేక రంగాలలో వారి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. క్రైస్తవులు తమ నిస్వార్థ సేవ ద్వారా, బలహీనుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడటం ద్వారా సమాజానికి ఎంతో గొప్ప సహాయం చేశారు. ఇటువంటి స్ఫూర్తిదాయకమైన కార్యాలు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

యేసు ప్రభువు చూపిన బాటలో నడుస్తూ సమాజంపై మనదైన ముద్ర వేయడానికి మనవెంత సిద్ధంగా ఉన్నాం? యేసు కుష్టురోగుల పట్ల కరుణ చూపాడు, సమాజంలో వెలివేయబడ్డ జక్కయ్య జీవితాన్ని మార్చి అతనికి నూతన జీవితాన్ని ప్రసాదించాడు, ఎందరినో స్వస్థపరిచాడు, అవసరమైన వేళ పెళ్లి విందులో నీటిని ద్రాక్షారసంగా మార్చాడు, వ్యభిచారిణి పాపాలను క్షమించి ఆమెకు విముక్తి కలిగించాడు, ఎలాంటి రిజర్వేషన్లు లేకుండా అందరినీ ప్రేమించాడు, చివరికి మానవాళి రక్షణ కోసం తన ప్రాణాలనే అర్పించాడు. ఈ గొప్ప త్యాగం మనకు ఆదర్శం కావాలి.

మొదటి సంఘం శిష్యులు కూడా తమ సమాజంపై ఎంతో గొప్ప ప్రభావాన్ని చూపారు. వారు సువార్తను నలుమూలలా వ్యాప్తి చేశారు, అనేకమందికి స్వస్థత చేకూర్చారు, దాతృత్వంతో జీవించారు, అంతేకాదు "ప్రపంచాన్ని తల క్రిందులు చేసిన ప్రజలు" అనే బిరుదును కూడా పొందారు. వారిలో చాలామంది ప్రభువు కోసం ప్రాణాలను అర్పించడానికి కూడా వెనుకాడలేదు. వారి నిబద్ధత, ధైర్యం మనకు స్ఫూర్తినిస్తాయి.

అలాగే, మన యుఇయస్ఐ పితరులు కళాశాల క్యాంపస్‌లలో ప్రభావం చూపడం ద్వారా, వారి విశ్వాసం, నాయకత్వం, త్యాగం ద్వారా దేశాన్ని తీర్చిదిద్దడం ద్వారా గొప్ప వారసత్వాన్ని మిగిల్చారు. ఇప్పుడు సమాజాన్ని, సంఘాన్ని ప్రభావితం చేసే అవకాశం మనదే. మన వంతు కృషి చేయడానికి సంసిద్ధంగా ఉందాం.

## ముగింపు

ఒక వ్యక్తి యేసు శిష్యుడిగా ఈ లోకాన్ని ప్రభావితం చేయాలంటే కేవలం విశ్వాసం ఉంటే సరిపోదు, క్రియలు కూడా ఎంతో అవసరం. యేసుక్రీస్తు బోధనల ప్రకారం మన జీవితాన్ని జీవించడం, సువార్తను ఇతరులతో పంచుకోవడం, నిరంతరం ప్రేమను, దయను చూపిస్తూ ఉండటం ఇందులో ముఖ్యమైన భాగాలు. ఇలా చేయడం ద్వారా మన చుట్టూ ఉన్న ప్రజల జీవితాల్లో ఒక అర్థవంతమైన మార్పును తీసుకురావడమే కాకుండా, నిరీక్షణ కోల్పోయినవారికి, సత్యం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ లోకానికి యేసుక్రీస్తు స్వభావాన్ని మన జీవితాల ద్వారా తెలియజేస్తాము.

విశ్వాసం కలిగి ఉండటం నిజంగానే ఒక గొప్ప విషయం. అయితే, ఒక విత్తనం మొలకెత్తడానికి నీరు, సూర్యరశ్మి ఎంత అవసరమో, మన విశ్వాసానికి కూడా క్రియలు అంతే అవసరం. కాబట్టి, విశ్వాసంతో పాటు క్రియలను కూడా జోడించి, శిష్యులుగా మన జీవితాలను ఒక అర్థవంతమైన మార్గంలో నడిపిద్దాం. మన చుట్టూ ఉన్న సమాజానికి ఒక మంచి ఉదాహరణగా నిలిచి ప్రపంచాన్ని ప్రభావితం చేద్దాం.

– అనిల్ మాతంగి
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్
వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్, వరంగల్



# దేవుని చిత్తం చిక్కు ప్రశ్న కాదు

జీవితంలో చాలామంది దిక్కుతోచని స్థితిలో, అయోమయంగా, తమ గమ్యం గురించి నిశ్చయత లేనివారై సతమతమవుతుంటారు. ఒక విశ్వాసి అడగదగిన అత్యంత ముఖ్యమైన, నిజాయితీతో కూడిన ప్రశ్న ఏమిటంటే, "నా జీవితం పట్ల దేవుని చిత్తం ఏమిటి?" కొందరు దేవుని చిత్తం ఒక గందరగోళమైన రహస్యంగానో లేదా కనుగొన డానికి కష్టమైన మార్గంగానో ఊహించుకుంటారు. కానీ దేవుని చిత్తం ఒక చిక్కు ప్రశ్న కాదన్నది సుస్పష్టం.

కొద్దిమంది మాత్రమే పరిష్కరించడానికి ఉద్దేశించిన సంక్లిష్టమైన, నిరాశపరిచే పజిల్ కాదు ఇది. అట్లాగని, ఖచ్చితమైన సరళమైన రోడ్‌మ్యాప్ కూడా కాదు. బదులుగా, అది నమ్మకమైన, ప్రేమగల దేవునిచే అడుగడుగునా నడిపించబడే ఒక ప్రయాణం. దేవుని చిత్తం ఎల్లప్పుడూ మంచిది, ఆనందకరమైనది, పరిపూర్ణమైనది. మనం ఆయనతో నడుస్తున్నప్పుడు, ఆయన ప్రతి అడుగులోనూ మనతో ఉన్నాడని మనం కనుగొంటాం. దేవుని చిత్తంలో ఉన్నప్పుడు మనం అంతర్గత ఆనందాన్ని, సంతృప్తిని, నెరవేర్పును అనుభవించవచ్చు.

## దేవుడు మనలను ఒక ఉద్దేశ్యంతో సృష్టించాడు

దేవుడు మనలను సృష్టించాడు. మనమెవ్వరమూ యాదృచ్ఛికంగానో, పొరపాటునో పుట్టిన వాళ్ళం కాదు. దేవుడు తన స్వరూపంలో, తన పోలికలో మనలను సృష్టించాడు. ఆయన మనలను ఒక కారణంతో సృష్టించాడు. "యెహోవా ప్రతి దానిని దాని దాని పనికొరకు నియమించెను" (సామెతలు 16:4). మన జీవితంలో దేవుని ఉద్దేశ్యం తెలుసుకోవడం ద్వారా, ఆయన పరిపూర్ణమైన చిత్తాన్ని తెలుసుకోవడానికి కూడా సహాయపడుతుంది.

చాలామంది దేవుడు సర్వాధిపతి అని, ఆయన చిత్తం ఏదైతే అది జరుగుతుందని భావిస్తారు. కానీ

కానీ అది నిజం కాదు. దేవుని చిత్తాన్ని తెలుసుకోవడానికి ఒక ప్రత్యేకమైన పద్ధతి అంటూ ఏదీ లేదు. అయితే కొన్ని మార్గాల ద్వారా మనం ఆయన చిత్తాన్ని తెలుసుకోవచ్చు. వాటిలో ముఖ్యమైనది దేవుని వాక్యాన్ని చదవడం, ధ్యానించడం. మన జీవితం పట్ల ఆయన చిత్తాన్ని కనుగొనడానికి బైబిల్ సరైన పుస్తకం. ప్రార్థన ద్వారా మన ప్రణాళికలను, కోరికలను దేవునికి పూర్తిగా సమర్పించుకోవడం మరొక మార్గం. మన జీవితాల్లో దేవుని చిత్తాన్ని కనుగొనడానికి ఇది సహాయపడుతుంది. దేవుని వాక్యం చదవడం, ప్రార్థన చేయడం ద్వారా మనం దేవునికి దగ్గరవుతాం. ఆయన మనతో మాట్లాడటానికి, నడిపించడానికి సిద్ధంగా ఉన్నాడు.

## దేవుని చిత్తంలోని మూడు వర్గీకరణలు

మనం దేవుని చిత్తం గురించి ఆలోచిస్తున్నప్పుడు, "సర్వాధిపతి అయిన ప్రభువు చిత్తం" యొక్క మూడు పద్ధతులను మనం అర్థం చేసుకోవాలి. ఈ జ్ఞానాన్ని మనం కలిగియుండడం ద్వారా, దేవుని సంకల్పాన్ని మరింత లోతుగా తెలుసు కోవచ్చు, తద్వారా మన జీవితాలను ఆయన చిత్తాను సారంగా మలచుకోవచ్చు.

### 1. సర్వాధిపతి లేదా వివరణాత్మక చిత్తం (The Sovereign or Descriptive Will)

దీనిని తరచుగా దేవుని రహస్య చిత్తంగా అభివర్ణిస్తారు. ఇది దేవుని అంతిమ ప్రణాళిక మరియు అన్ని విషయాల పట్ల ఆయన ఉద్దేశం. ఇది కేవలం ఆయనకు మాత్రమే తెలుసు, అంతిమంగా ఆయన ద్వారా నెరవేర్చబడుతుంది. ఒక ఉదాహరణ ద్వారా చూద్దాం – ప్రపంచంలో ఎక్కడ, ఏ సమయంలో ఏమి జరగాలనేది దేవుడు ముందుగానే నిర్ణయిస్తాడు. అది ఆయన సర్వాధిపతి చిత్తం. మనకు కొన్నిసార్లు అర్థం కాకపోయినా, ఆయన సంకల్పం ప్రకారమే అన్నీ జరుగుతాయని నమ్మాలి.

### 2. ఆదేశాత్మక చిత్తం (Preceptive)

ఇది వెల్లడి చేయబడిన దేవుని చిత్తాన్ని సూచిస్తుంది, ఇది ఆయన ఆజ్ఞలు, సూచనలు, లేఖనాల్లోని బోధనల ద్వారా తెలియజేయబడింది.

సరళంగా చెప్పాలంటే, దేవుడు మన నుండి ఏమి ఆశిస్తున్నాడో ఈ చిత్తం తెలియజేస్తుంది. బైబిల్ చదవడం, ప్రార్థన చేయడం ద్వారా మనం దీనిని తెలుసుకోవచ్చు. ఉదాహరణకు, "అబద్ధమాడకూడదు", "దొంగతనం చేయకూడదు" వంటి ఆజ్ఞలు దేవుని ఆదేశాత్మక చిత్తానికి నిదర్శనం. వీటిని అనుసరించడం ద్వారా మనం దేవునికి ఇష్టమైన జీవితాన్ని జీవించవచ్చు.

### 3. అనుమతించే చిత్తం (Permissive)

ఇది దేవుని పరిపూర్ణ చిత్తానికి అనుగుణంగా లేని సంఘటనలను దేవుడు అనుమతించడాన్ని సూచిస్తుంది, కానీ అంతిమంగా ఆయన నియంత్రణకు లోబడి ఉంటాయి. ఆయన తన సార్వభౌమ చిత్తాన్ని నెరవేర్చడానికి అంతిమంగా ఈ సంఘటనలను ఉపయోగిస్తాడు. కొన్నిసార్లు మన జీవితంలో కష్టాలు, నష్టాలు ఎదురవుతాయి. అవి దేవుని చిత్తానికి వ్యతిరేకంగా జరిగినట్లు అనిపించవచ్చు. కానీ, దేవుడు వాటిని కూడా తన ప్రణాళికలో భాగంగా చేసుకుంటాడు. చివరికి, ఆ కష్టాల ద్వారా కూడా మనకు మేలు కలుగుతుంది.

ఈ మూడు రకాల చిత్తాలను అర్థం చేసుకోవడం ద్వారా, దేవునితో మన సంబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చు. ఆయన చిత్తానుసారంగా జీవించడానికి ప్రయత్నించవచ్చు.

## దేవుని చిత్తం ఏమిటి? దానిని ఎలా తెలుసుకోవాలి?

జీవితంలో మనకు ఒక లక్ష్యం, ఒక మార్గం ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అయితే, ఆ మార్గం దేవుని చిత్తానికి అనుగుణంగా ఉంటే, మన జీవితం మరింత అర్థవంతంగా, ఆనందంగా

ఉంటుంది. దేవుని చిత్తం తెలుసుకోవడం ఎలా? ఆయన మన కోసం ఏమి కోరుకుంటున్నాడో ఎలా గ్రహించాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుందాం.

### 1. దేవుని సార్వత్రిక చిత్తం (God's Universal Will)

దేవుడు మన నుండి మొదటిగా కోరుకునేది ఏమిటంటే, యేసుక్రీస్తును మన ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించడం. "ఆయన ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచున్నాడు" (2 పేతురు 3:9). కాబట్టి, మనల్ని మనం ఆయనకు సమర్పించుకుని, ఆయన ఆధిపత్యానికి లోబడి ఉండాలి. రక్షణ అనేది మన జీవితంలో దేవుని చిత్తాన్ని కనుగొనడంలో మొదటి మరియు ముఖ్యమైన అడుగు.

"మీరు పరిశుద్ధులగుటకును, జారత్వమునకు దూరముగా ఉండుటకును, అన్యజనులు దేవుని ఎరుగనివారై కామాతురులై యున్నట్టు కాక, మీలో ప్రతివాడును తన తన శరీరమును పరి శుద్ధతయందును, ఘనతయందును ఏలుకొనవలె నని దేవుని చిత్తమైయున్నది" (1 థెస్స 4:3-5). దేవుడు మనకు తెలియజేసిన చిత్తాన్ని మనం నెరవేర్చినప్పుడు, ఆయన మనకు తెలియజేయని చిత్తాన్ని కూడా వెల్లడి చేస్తాడు.

### 2. సజీవ యాగం (A Living Sacrifice)

మనం దేవునితో సంబంధం కలిగి ఉన్న తర్వాత, మన జీవితాల కోసం ఆయన సంపూర్ణమైన చిత్తం ఏమిటో తెలుసుకోవడానికి ముందుకు సాగవచ్చు. దేవుడు మనల్ని ఏదైనా చేయమని చెబితే, మనం దానిని తప్పకుండా చేయాలి. పరిస్థితులు, పర్యవసానాలు ఎలా ఉన్నప్పటికీ, దేవుని చిత్తం మనకు తిరుగులేనిదిగా ఉండాలి.

మన జీవితాల పట్ల దేవుని సంపూర్ణ చిత్తాన్ని కనుగొనడంలో మొదటి దశ, మనల్ని మనం సజీవ యాగంగా, పరిశుద్ధంగా, ఆయనకు అంగీకార యోగ్యంగా మార్చుకోవడం (రోమా 12:1). మనం ఆయన కోసం ఏమి చేయగలమో దాని కంటే ఎక్కువగా దేవుడు మనల్ని ప్రేమిస్తాడు. సజీవ యాగం కావాలంటే, మన స్వార్థపూరితమైన కోరికలను చంపుకుని మనకు మనం చని పోవాలి.

### 3. మనస్సును నూతనపరచుకోవడం (Renewing Our Mind)

దేవుని చిత్తాన్ని కనుగొనడంలో, మనస్సును నూతనపరచుకోవడం కూడా అంతే ముఖ్యం. నూతనపరచబడిన మనస్సు లేకుండా, మన జీవితాల పట్ల దేవుని సంపూర్ణ చిత్తాన్ని మనం కోల్పోయే ప్రమాదం ఉంది.

మన మనస్సులు దేవుని వాక్య సత్యంతో నూతన పరచబడాలి. మనస్సును నూతనపర్చుకోవడం ద్వారా రూపాంతరం వస్తుంది, ఆపై అది దేవుని పరిపూర్ణమైన చిత్తాన్ని తెలుసుకోవడానికి మనల్ని నడిపిస్తుంది. చాలాసార్లు, మనం పోరాడుతున్నాం కాని మన జీవితాల్లో దేవుని చిత్తం నెరవేరడం చూడలేదు, బహుశా మనం మన మనస్సును దేవుని ఆలోచన విధానానికి అనుగుణంగా నూతనపరచుకోకపోవడమే కారణం కావచ్చు. మనం దేవుని వాక్యంతో మన మనస్సును నూతనపరచుకోవాలి, అప్పుడు మనం దేవుని పరిపూర్ణమైన చిత్తాన్ని తెలుసుకుంటాము.

### 4. దేవుని వాక్యం (Word of God)

దేవుని చిత్తాన్ని మన జీవితాల్లో కనుగొనడానికి దేవుని వాక్యం చాలా అవసరం. దేవుని వాక్యం హృదయ ఆలోచనలను, ఉద్దేశముల ను వివేచించేదిగా ఉంటుంది (హెబ్రీయులు 4:12). ఈ వాక్యం మనల్ని సరైన మార్గంలో నడిపించడానికి ఒక వెలుగులా పనిచేస్తుంది.

దేవుని చిత్తాన్ని కనుగొనడం అనేది మన భావాలు ఆత్మ నుండి వస్తున్నాయా లేక శరీరము నుండి వస్తున్నాయా అని తెలుసుకోవడం ద్వారా

సులభం అవుతుంది. దేవుడు మన అడుగులను నిర్దేశిస్తాడు, కానీ ఆయన మార్గం యొక్క చివరిని ప్రారంభం నుండి మనకు చూపించడు. దేవుడు తన చిత్తాన్ని అంచెలంచెలుగా మనకు వెల్లడి చేస్తాడు. ఒక్కసారిగా మొత్తం చిత్రం మనకు కనిపించదు.

దేవుని చిత్తం మన జీవితాల్లో వెంటనే నెరవేరదు. దేవుని చిత్తాన్ని కనుగొనడంలో, అనుసరించ డంలో, నెరవేర్చడంలో వృద్ధి ప్రక్రియ ఉంటుంది. ఒక మొక్క ఎదగడానికి సమయం పట్టినట్లే, దేవుని చిత్తం మన జీవితాల్లో నెరవేరడానికి కూడా సమయం పడుతుంది. అప్పుడే మనకు పెద్ద చిత్రం తెలుస్తుంది. దేవుని చిత్తం యొక్క కేంద్రంలో ఉండటం వలన ఒక రకమైన సంతృప్తి కలుగుతుంది.

దేవుని చిత్తాన్ని కనుక్కోవడం చాలా ముఖ్యమైన విషయమే అయినప్పటికీ, అది కేవలం ప్రారంభం మాత్రమే. దేవుని చిత్తాన్ని కనుక్కోవడానికి, దాన్ని అనుసరించడానికి చాలా తేడా ఉంది. ఆయన చిత్తాన్ని నెరవేర్చడానికి మనకు దేవుని జ్ఞానం అవసరం. దేవుని చిత్తంలో ఆయన సమయం కూడా ఉంటుంది. ప్రతిదీ ఒక నిర్దిష్ట సమయంలోనే జరుగుతుంది.

### 5. ప్రార్థన

ప్రార్థన అనేది దేవునితో మాట్లాడటానికి, ఆయన మార్గనిర్దేశం కోసం అడగడానికి ఒక ముఖ్యమైన మార్గం. ప్రార్థన ద్వారా దేవుని చిత్తాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించడం వల్ల, ఆయన ఉద్దేశాలను, మన జీవితం కోసం ఆయనకున్న ప్రణాళికను అర్థం చేసుకోవచ్చు. మనసు విప్పి, నిజాయితీగా ప్రార్థించినప్పుడు, దేవుడు మనకు సరైన మార్గాన్ని చూపిస్తాడు.

### 6. పరిశుద్ధాత్మ నడిపింపును విశ్వసించడం

మనము నిజాయితీగా దేవుని చిత్తాన్ని తెలుసు కోవాలని కోరుకున్నప్పుడు, ఆయన మనకు ఒక అంతర్గత నమ్మకాన్ని లేదా ప్రేరేపణను ఇస్తాడు. దేవుని ఆత్మ ద్వారా, ఆయన మనల్ని ఏ మార్గంలో నడవమని కోరుకుంటున్నాడో నిర్ధారిస్తాడు. బైబిల్ కూడా ఇదే విషయాన్ని మనకు తెలియజేస్తోంది. “నీవు కుడి తట్టుకు తిరిగినా ఎడమ తట్టుకు తిరిగినా ఇదియే మార్గము, దీనిలో నడువుడి అని నీ వెనుక నుండి ఒక శబ్దము నీ చెవులకు వినబడును.” (యెషయా 30:21).

### 7. విధేయత

మన జీవితాల్లో దేవుని చిత్తాన్ని కనుగొనడానికి, దాని నెరవేర్చడానికి విధేయత చాలా అవసరం (యెషయా 1:18-19, రోమా 6:16). దేవుని స్వరాన్ని వినడం మాత్రమే సరిపోదు. మన జీవితాల్లో ఆయన సంకల్పాన్ని నెరవేర్చడానికి ఆయన చెప్పినది మనం తప్పక చేయాలి. విధేయత చూపినప్పుడే దేవుడు మనకు తన ప్రణాళికను తెలియజేస్తాడు.

### ముగింపు

దేవుని చిత్తం ఒక గందరగోళమైన చిక్కు కాదు. అది మనల్ని నిరాశపరచడానికి లేదా తప్పుదారి పట్టించడానికి దాచబడలేదు. అది విశ్వాసం, సమర్పణతో కూడిన దైనందిన నడక. దేవుని చిత్తాన్ని కనుగొనడం ఒక్కసారిగా జరిగేది కాదు. దీనికి ప్రార్థన, నమ్మకం, అధ్యయనం, పునరుద్ధరణ మరియు విధేయత అవసరం.

దేవుని చిత్తానికి కేంద్రంగా ఉండటం వలన కేవలం దిశా నిర్దేశం మాత్రమే కాదు; ఇది అర్థం, స్పష్టత మరియు దైవిక శాంతిని తెస్తుంది. మనం పూర్తిగా ఆయనకు లోబడి, ఆయన వాక్యానికి మరియు ఆత్మ మనలను నడిపించడానికి అనుమతించినప్పుడు, మనం ఆయన పరిపూర్ణ చిత్తంలో జీవిస్తాము – ఒక్కో అడుగు వేసుకుంటూ ముందుకు సాగుతాము.

– ఎ. అప్పారావ్, నేషనల్ స్టాఫ్,
ఉదయ్‌పూర్, రాజస్థాన్




# సువార్త - న్యాయం

## భవిష్యత్‌కు మార్గదర్శకం

నేటి సమాజంలో "న్యాయం" అనే మాట ప్రతి ఒక్కరి నోర్లో నానుతుంది. ప్రత్యేకించి సామాజిక న్యాయం గురించిన చర్చలు విస్తృతంగా జరుగుతున్నాయి. బైబిల్లో న్యాయానికి సంబంధించిన పదాలు దాదాపు 400 కంటే ఎక్కువ సార్లు ప్రస్తావించబడ్డాయి. న్యాయం అంటే ఏమిటి అని అడిగితే వెంటనే నిర్వచించలేకపోవచ్చు, కానీ దాని అంతరార్థం మనస్సులో చాలా స్పష్టంగా ఉంటుంది.

న్యాయం అంటే ఇతరుల పట్ల సమంగా, సహేతుకంగా, నైతికంగా వ్యవహరించడం. ఈ లక్షణం దేవుని స్వభావంలోని ఒక ముఖ్యమైన భాగం. పాత నిబంధనలో సృష్టి మొదలుకొని నుండి చివరి ప్రవక్తల గ్రంథాల వరకు దేవుడు తన న్యాయాన్ని స్పష్టంగా ప్రకటిస్తూ వచ్చాడు.

### దేవుని సృష్టిలో సమానత్వానికి ప్రాధాన్యం

ఆదికాండం 1:27 ప్రకారం, దేవుడు మనుష్యలను తన పోలికలో సృష్టించడం ద్వారా వారు తన లక్షణాలను కలిగి ఉండాలని దేవుడు కోరుకున్నాడు. స్త్రీని పురుషుడికి సాటి అయినదిగా, సమానమైనదిగా సృష్టించటం, ఇద్దరికీ సమాన బాధ్యతలను, ఆశీర్వాదాలను ఇవ్వడం, దేవుని దృష్టిలో సమానత్వం ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. ఇశ్రాయేలీయులకు ప్రవక్తగా, న్యాయాధిపతిగా ఉన్న మోషే ద్వితీ 32:4లో ఇలా వ్రాశాడు, "ఆయన కార్యము సంపూర్ణము; ఆయన చర్యలన్నియు న్యాయములు" ఇశ్రాయేలు ప్రజలు న్యాయాన్ని విడిచిన ప్రతిసారీ, దేవుడు వారిని తిరిగి మేల్కొలిపేందుకు ప్రవక్తల ద్వారా బోధించాడు.

### ప్రేమ, కనికరం, దయతో కూడిన న్యాయం

దేవుడు న్యాయం గురించి చెప్పిన ప్రతి సందర్భంలో ప్రేమను, కనికరాన్ని, దయను కలిపి చెప్పాడు. యెషయా 61:8, మీకా 6:8, జెకర్యా 7:9 వచనాల్లో ఈ విషయాన్ని మనం చూడవచ్చు. అణచివేయబడిన వారి గురించి, తండ్రిలేని పిల్లలు, విధవరాండ్రు, పరదేశుల గురించి న్యాయం చేయాలని అధికారులను, ప్రజలను దేవుడు హెచ్చరించాడు (యెషయా 1:17, యిర్మీయా 22:3, కీర్తన 82:3, ద్వితీ 27:19).

భార్యను విడిచిపెట్టడాన్ని దేవుడు తీవ్రంగా పరిగణించాడు. అది అసహ్యమైన క్రియ అని చెబుతూ, అలాంటి వారి అర్పణలను స్వీకరించనని మలాకీ 2:13-16లో స్పష్టం చేశాడు.

### పాత నిబంధనలో స్త్రీలకు సముచిత స్థానం

పాత నిబంధన కాలంలో కూడా దేవుడు స్త్రీలకు సముచిత స్థానం ఇచ్చాడు. శారా, రిబ్కా, మిర్యాము, దెబోరా, రూతు, ఎస్తేరు వంటి వారిని ప్రవక్తలుగా, న్యాయాధిపతులుగా, విశ్వాసవీరులుగా బైబిల్లో సముచిత స్థానాన్ని దేవుడు వారికి ఇచ్చాడు.

దేవుని న్యాయం కేవలం శిక్షించడానికే కాదు, రక్షించడానికి, సరిదిద్దడానికి కూడా ఉద్దేశించ బడింది. కాబట్టి, మన జీవితాల్లో న్యాయాన్ని అనుసరిస్తూ, దేవుని ప్రేమను, కనికరాన్ని ఇతరులకు పంచుదాం.

### ధర్మశాస్త్రం: దేశాలకు ఆదర్శం, సమాజానికి వెలుగు

దేవుడు మోషేకు ఇచ్చిన ధర్మశాస్త్రం నేటి ఎన్నో దేశాల రాజ్యాంగాలకు ఒక గొప్ప ఆదర్శంగా నిలుస్తుంది. ఈ ధర్మశాస్త్రం కేవలం చట్టాల సమాహారం మాత్రమే కాదు, ఇది నీతి, న్యాయం, ధర్మం అనే పునాదులపై ఆధారపడిన ఒక జీవన విధానం.

ఇశ్రాయెల్ దేశానికి చెందిన 'ఇశ్రాయెల్ హయోమ్' అనే దినపత్రికతో నెస్సెట్ రాజ్యాంగం, చట్టం మరియు న్యాయ కమిటీ ఛైర్మన్ నిస్సాన్ స్లోమియన్స్కీ మాట్లాడుతూ, "ఇశ్రాయెల్‌కు ఇప్పటికే బైబిల్ రూపంలో ఒక రాజ్యాంగం ఉంది" కాబట్టి ప్రత్యేకంగా రాజ్యాంగాన్ని రూపొందించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దీనిని బట్టి బైబిల్ ఎంతటి ప్రాముఖ్యతను సంతరించుకుందో అర్థం చేసుకోవచ్చు. బైబిల్‌లోని న్యాయ సూత్రాలు మానవులందరూ నీతిగా, న్యాయంగా జీవించాలని బోధిస్తాయి.

వరల్డ్ హ్యాపీ ఇండెక్స్‌లో ఇశ్రాయెల్ మొదటి పది స్థానాల్లో ఉండటానికి కారణం ఇదే. అక్కడ ప్రజలందరికీ సమాన అవకాశాలు ఉండటమే కాకుండా, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కూడా వారు సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతున్నారు.

### యేసుక్రీస్తు: కనికరం, న్యాయం కలగలిసిన మార్గం

నూతన నిబంధనలో యేసుక్రీస్తు తన పరిచర్యను సమాజంలోని బలహీనులతో, స్త్రీలతో, వెలివేయబడిన వారితో, సహాయం నోచుకోని వారితో కొనసాగించాడు. ఆయన చూపిన కరుణ, ప్రేమ ఎందరికో స్వస్థతను, మనశ్శాంతిని కలిగించాయి. ఆయన దయగల మాటలు వినడానికి, ఆయనను అనుసరించడానికి ప్రజలు ఆసక్తి చూపేవారు.

యేసుప్రభువు స్వయంగా అవసరమైన వారి దగ్గరకు వెళ్ళి వారి అవసరాలను తీర్చేవాడు. జక్కయ్య, సమరయ స్త్రీ, పక్షవాతంతో బాధ పడుతున్న వ్యక్తి, దయ్యం పట్టిన వ్యక్తి. ఇలా ఎందరికో ఆయన స్వస్థత చేకూర్చాడు. యేసు తన జీవితం ద్వారా, బోధనల ద్వారా సత్యాన్ని, న్యాయాన్ని స్థాపించడానికి అహింసా మార్గాన్ని ఎంచుకున్నాడు.

"నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించు" అనే పాత నిబంధనలోని ఆజ్ఞను యేసు తన బోధనల ద్వారా మరింత స్పష్టంగా తెలియజేశాడు. ప్రజలను మోసం చేస్తూ బాధిస్తున్న పరిసయ్యులను, శాస్త్రులను, యాజకులను ఆయన నిలదీశాడు. వ్యభిచారం చేస్తూ పట్టుబడిన స్త్రీతో యేసు మాట్లాడిన మాటలు ఆయన కనికరాన్ని, న్యాయాన్ని ఒకేసారి చూపిన విధానానికి నిదర్శనం.

శిక్షించడం కంటే మార్పు తీసుకురావడం ద్వారా సమాజాన్ని, వ్యక్తిని సంస్కరించగలమని యేసు బోధించాడు. ఆయన చూపిన మార్గం మనందరికీ ఆదర్శం.

### సువార్త వెలుగులో సామాజిక విప్లవాలు

చరిత్ర పుటల్లోకి తొంగి చూస్తే, సామాజిక విప్లవాలు ఒక సాధారణ దృగ్విషయంగా కనిపిస్తాయి. ఆర్థిక అసమానతలు, రాజకీయ అణచివేతలు, సైద్ధాంతిక విభేదాలు వంటి అనేక అంశాలు ఈ విప్లవాలకు దారితీశాయి. అయితే, కొన్ని విప్లవాలు ఒక ప్రత్యేకమైన శక్తితో నడిచాయి – అదే సువార్త ప్రేరణ. అమెరికన్ విప్లవం వంటి అనేక చారిత్రక ఉద్యమాలకు ఇది ఊపిరిలూదింది.

యేసుక్రీస్తు బోధనలు, ముఖ్యంగా కరుణ, ప్రేమ, మరియు సామాజిక న్యాయంపై ఆయన చూపిన శ్రద్ధ, చరిత్రలో సామాజిక సంస్కరణలకు, విప్లవాత్మక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయి. అట్టడుగు వర్గాలకు ఊతమివ్వడానికి, అప్పటి అధికారాలను సవాలు చేయడానికి వ్యక్తులను, ఉద్యమాలను ఆయన బోధనలు ప్రభావితం చేశాయి.

### సమాజ మార్పులో యేసు క్రీస్తు బోధనల ప్రభావం

అమెరికన్ విప్లవం (1775–1783) స్వాతంత్ర్యం,

సమానత్వం అనే ముఖ్య అంశాలతో అమెరికాను ఒక దేశంగా ఏర్పరచింది. అదే స్ఫూర్తితో ఫ్రెంచ్ విప్లవం, రష్యా విప్లవం కూడా జరిగాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ కూడా యేసుక్రీస్తు బోధనలైన అహింసను ఆయుధంగా చేసుకుని పోరాడాడు.

అమెరికాలో పౌర హక్కుల ఉద్యమం క్రైస్తవ బోధనలపై, ముఖ్యంగా ప్రేమ, సమానత్వం, న్యాయం అనే క్రైస్తవ సూత్రాల ఆధారంగానే నడిచింది. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ వంటి నాయకులు విభజన, వివక్షకు వ్యతిరేకంగా అహింసాత్మక ప్రతిఘటనను ప్రేరేపించడానికి క్రైస్తవ వాక్చాతుర్యం ద్వారా ప్రజలను ఉత్తేజపరిచి, శాంతియుతంగా పోరాడాడు. బానిసత్వాన్ని నిర్మూలించడానికి జరిగిన ఉద్యమం కూడా క్రైస్తవ బోధనల ద్వారానే ఊపిరి పోసుకుంది. బానిసత్వం అనేది ప్రేమ, సమానత్వం, న్యాయం అనే క్రైస్తవ సూత్రాలను ఉల్లంఘించడమేనని వాదిస్తూ, నిర్మూలనవాదులు యేసు బోధనల నే ఆయుధంగా చేసుకున్నారు. మహిళల హక్కుల కోసం, బాల కార్మికుల నిర్మూలన కోసం, పేదరికం, అసమానతలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు, సామాజిక సంస్కరణలకు కూడా యేసు బోధనలు స్ఫూర్తినిచ్చాయి. క్రైస్తవ కార్యకర్తలు, సంస్కర్తలు సామాజిక న్యాయం, మార్పు కోసం వాదించడానికి యేసు బోధనలనే ప్రాతిపదికగా తీసుకున్నారు.

**మిషనరీల సేవలు**

చరిత్ర పుటల్లోకి తొంగి చూస్తే, అనేకమంది మిషనరీలు కేవలం సువార్తను ప్రకటించడానికే పరిమితం కాకుండా, సమాజంలోని రుగ్మతల ను తొలగించడానికి సామాజిక సంస్కరణలలో చురుగ్గా పాల్గొన్నారు. విలియం కేరీ వంటి గొప్ప వ్యక్తి భారతదేశంలో మహిళల విద్య కోసం పాటుపడ్డారు, మెరుగైన ఆరోగ్య సేవలను అందించారు, అంతేకాకుండా సతి మరియు శిశు హత్యల వంటి దురాచారాలను సమాజం నుండి నిర్మూలించడానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. ఆఫ్రికాలో డేవిడ్ లివింగ్‌స్టోన్ బానిసత్వాన్ని రూపుమాపడానికి, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి అవిశ్రాంతంగా కృషి చేశాడు. యేసుక్రీస్తు 12 మంది శిష్యులు, పౌలు వంటి వారు సైతం న్యాయం కోసం, సత్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. వారి రాసిన సువార్తలు, పత్రికలు నేటికీ మనకు స్ఫూర్తినిస్తూ, మార్గనిర్దేశనం చేస్తున్నాయి.

**ముగింపు**

ప్రేమ, న్యాయం అనేవి సువార్త యొక్క ప్రధానమైన అంశాలు. ఈనాడు క్రైస్తవులుగా, క్రీస్తు సంఘంగా మన బాధ్యత మరింత గొప్పది. సువార్త ద్వారా పాప బానిసత్వం నుండి విడిపించడంతో పాటు, సమాజంలో వివక్షకు గురవుతున్న వారి కోసం సంఘంగా పోరాడాలి. మన చుట్టూ ఉన్న చీకటిని పారద్రోలడానికి, అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పడానికి, వివక్షకు గురవు తున్న వారికి అండగా నిలబడటానికి మనం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.

17వ శతాబ్దం నుండి 20వ శతాబ్దం వరకు క్రైస్తవ మిషనరీలు సమాజంలోని అన్యాయాలపై చేసిన పోరాటాలతో పోలిస్తే, ప్రస్తుత క్రైస్తవులు, సంఘాలు చేస్తున్న సేవా కార్యక్రమాలు చాలా తక్కువగా ఉన్నాయి. వారి సువార్త సేవ ఫలితంగానే మనకు ఈ వెలుగు లభించిందనే సత్యాన్ని మనం మరచి పోకూడదు. సువార్త అనేది యేసుక్రీస్తు జీవిత సత్యం. కాబట్టి, సువార్తను నమ్మిన మనం ఆయనను పోలి జీవించాలి. సువార్త మన బలం అయినప్పుడు, మన గళాన్ని విప్పి, కలం పట్టి, న్యాయం కోసం పోరాడే దళంగా కదలాలి. చీకటిలో ఉన్నవారికి వెలుగుగా, అన్యాయపు సమిధలకు బాసటగా, వివక్షలో మగ్గుతున్న వారికి నీడగా, అనాథలకు తోడుగా, అణచివేయబడ్డ వారికి చేయూతగా, నిరాశ్రయులైన వారికి సహాయకులుగా ఉంటూ సువార్తలోని దేవుని ప్రేమను పంచుదాం.

**– జి. యథార్థుడు,**
**హైదరాబాద్**



# పోరాటాలలోనే బలం దాగి ఉంది!

థియోడర్ హెచ్.ఎఫ్ తన పుస్తకం 'జాబ్: ఎ మ్యాన్ ట్రైడ్ యాజ్ గోల్డ్'లో యోబును "బ్రతకడానికి చనిపోయిన వ్యక్తి"గా అభివర్ణించారు. పోరాటాలు మనకు జీవాన్నిస్తాయి. అవును, కష్టాలు మనల్ని మరింత దృఢంగా తయారుచేస్తాయి.

చాలా పోరాటాలు ప్రాణాంతకం కావచ్చు లేదా ఆధ్యాత్మికంగా, శారీరకంగా అలసటకు గురిచేయవచ్చు. వ్యక్తిగత, వృత్తిగత లేదా ఆధ్యాత్మిక జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులు మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసి, భవిష్యత్తుపై ఒక అనిశ్చిత భావాన్ని కలిగిస్తాయి. కానీ, ఇలాంటి పోరాట సమయంలోనే మనలోని అంతర్గత బలాన్ని, మనోధైర్యాన్ని మనం కనుగొంటాం. పోరాటాలను వృద్ధికి, అభ్యసనకు, పరివర్తనకు అవకాశాలుగా స్వీకరించినప్పుడు, దేవుని వాక్యంలో మనం మరింత బలంగా బయటపడగలం.

## పోరాటాలు అనివార్యం

జీవితం అనేది మన సంకల్పాన్ని, విశ్వాసాన్ని, స్వభావాన్ని పరీక్షించే సవాళ్లతో నిండి ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో పోరాటాల ను ఎదుర్కొంటూనే ఉంటారు.

దేవుని వాక్యంలో ప్రతిబింబించినట్లుగా, ప్రకృతి తన లయలను వెల్లడిస్తుంది. ఆది 1:5లో దేవుడు వెలుగుకు "పగలు" అని, చీకటికి "రాత్రి" అని పేరు పెట్టాడు. సాయంత్రం, ఉదయం కలసి ఒక రోజు అయ్యింది. బైబిల్ ప్రకృతి నమూనాల ను ప్రతిబింబిస్తూ, సృష్టిలోని దైవిక క్రమాన్ని, వెలుగును, చీకటిని హైలైట్ చేస్తుంది. వెలుగు, చీకటి ఒకదాని తరువాత మరొకటి వచ్చినట్టు, జీవితంలో కష్టాలు, సుఖాలు కూడా వస్తూ ఉంటాయి.

యేసు ప్రభువు వారు యోహాను 16:33లో "నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. లోకములో మీకు శ్రమ కలుగును" అని అన్నాడు. అంటే, ఈ లోకం లో పోరాటాలు తప్పవని ఆయన స్పష్టం చేశాడు.

అమెరికన్ పాస్టర్ డాక్టర్ ఏడ్రియన్ రోజర్స్ ఒక ప్రసంగంలో ఇలా అన్నాడు: "నక్షత్రాలు ఎంతో అందంగా ఉంటాయి. అవి రాత్రి మాత్రమే కనిపిస్తాయి. పగటిపూట కూడా నక్షత్రాలు ఉన్నప్పటికీ, సూర్యకాంతి వాటి వెలుగును డామినేట్ చేస్తుంది. రాత్రి వేళ అద్భుతమైన దృశ్యం మనకు కనిపిస్తుంది. నక్షత్రాలను వాటి పూర్తి వైభవంలో చూసే అవకాశం లభిస్తుంది." రాత్రులు జీవితంలో ఒక భాగమైనట్లే, పోరాటాలు కూడా జీవితంలో ఒక భాగం.

### పోరాటాన్ని అర్థం చేసుకోవడం

పోరాటాలు ఆధ్యాత్మికంగా ఎదగడానికి, మన స్వభావాన్ని మెరుగుపరచుకోవడానికి, దేవునికి మరింత దగ్గరవ్వడానికి ఒక అవకాశం.

పౌలు రోమా 5:3–4లో ఇలా వ్రాశాడు: "శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగ జేయునని యెరిగి శ్రమలయందును అతిశయ పడుదము. ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహింపబడిన పరి శుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయ ములలో కుమ్మరింపబడియున్నది" అంటే, కష్టాలు మనల్ని ఓర్పుతో ఉండడానికి, మనల్ని మనం పరీక్షించుకోవడానికి, నిరీక్షణతో ఎదురు చూడడానికి సహాయపడతాయి.

ఎన్నో పోరాటాలు చాలా కఠినంగా ఉండవచ్చు. కానీ విశ్వాసంతో, పట్టుదలతో మనం వాటిని అధిగమించడానికి కావాల్సిన బలాన్ని పొందవచ్చు. కాబట్టి, పోరాటాన్ని ఒక సవాలుగా స్వీకరించి, మనల్ని మనం మరింత శక్తిమంతులుగా తీర్చి దిద్దుకుందాం.

### పోరాటాలలో బలాన్ని కనుగొనడానికి ఆచరణాత్మక మార్గాలు

జీవితంలో పోరాటాలు సర్వసాధారణం. అయితే, ఈ కష్ట సమయాల్లోనే మన నిజమైన బలం బయటపడుతుంది. దేవుని సహాయంతో మనం ఈ పోరాటాలను ఎలా ఎదుర్కోవాలో ఇప్పుడు చూద్దాం.

#### 1. దేవుని వాక్యం

కీర్తనలు 119:105లో "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది" అని చెప్పబడింది. దేవుని వాక్యాన్ని చదవడం, దాని గురించి ధ్యానించడం, మనల్ని దేవుని చిత్తానికి అనుగుణంగా నడిపిస్తుంది. దేవుని వాక్యంలో నిమగ్నమవ్వడం ద్వారా, మన జీవితానికి సరైన మార్గనిర్దేశం లభిస్తుంది.

#### 2. ప్రార్థనలో దేవునితో సాన్నిహిత్యం

ప్రార్థన ద్వారా దేవునితో ఒక బలమైన సంబంధాన్ని ఏర్పరచుకోవాలి. కష్టాల్లో ఉన్నప్పుడు, మనం చేసే సాధారణ ప్రార్థనలు సరిపోవు. అర్థవంతమైన ప్రార్థన ద్వారా దేవుని మార్గదర్శ కత్వం, ఓదార్పు మరియు బలాన్ని పొందవచ్చు. ఫిలిప్స్ బ్రూక్స్ చెప్పినట్లు, "ప్రార్థన దేవుని అయిష్టతను అధిగమించడం కాదు; అది ఆయన అత్యున్నత సంకల్పాన్ని పట్టుకోవడం."

#### 3. బలహీనతను స్వీకరించడం

మన బలహీనతలను గుర్తించి, దేవుని శక్తి మనల్ని నింపడానికి అవకాశం ఇవ్వాలి. 2 కొరింథీయులు 12:9లో చెప్పినట్లుగా, దేవుని శక్తి బలహీనతలోనే పరిపూర్ణమవుతుంది.

#### 4. విశ్వాసం బాధను మారుస్తుంది

పోరాటాలను వృద్ధికి అవకాశంగా చూడాలి. దేవుని ఏర్పాటుపై నమ్మకం ఉంచాలి. క్షమాపణ మరియు కృపను చూపించాలి. కొలొస్స 3:1–2లో చెప్పినట్లుగా, "మీరు క్రీస్తుతో కూడా లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు. పైనున్న వాటిమీదనేగాని, భూసంబంధమైనవాటిమీద మనస్సు పెట్టుకొనకుడి." మనం పైనున్న వాటి మీద మనస్సు పెట్టినప్పుడు బాధను లెక్కచేయము.

#### 5. ఇతరులకు సేవ చేయడం

ఇతరులకు సేవ చేయడం ద్వారా దేవుని ప్రేమను, కరుణను చూపించాలి. ఈ క్రమంలో మన పోరాటాలను మనం మర్చిపోతాము. ఫిలిప్పీయులకు రాసిన పత్రిక 2వ అధ్యాయంలో పౌలు నిస్వార్థ సేవకు సంబంధించిన మూడు ఉదాహరణలను వివరించాడు: యేసుక్రీస్తు వినయం, తిమోతి యొక్క నిజమైన శ్రద్ధ మరియు ఎపఫ్రొదితు యొక్క త్యాగపూరిత సేవ. వీరు ముగ్గురు ఇతరులను సేవించడంలో నిమగ్నమైనప్పుడు, వారి పోరాటాలు తగ్గి పోయాయి.

### ముగింపు

కష్టాలను జయించిన వారి బైబిల్ ఉదాహరణల ను గుర్తుంచుకోవడం ద్వారా, మనం కూడా అదే చేయడానికి ప్రోత్సాహం పొందవచ్చు. దేవుడు మనతో ఉన్నాడనే జ్ఞానంతో మనం నిరీక్షణతో, ధైర్యంగా ఉండవచ్చు. ఆయన మన మేలు కొరకు అన్ని విషయాల్లో సహాయం చేస్తాడు. మన పోరాటాలు ఆయన విశ్వాస్యతకు, ప్రేమకు సాక్ష్యాలుగా నిలుస్తాయి.

– రవీంద్రనాథ్,
గ్రాడ్యుయేట్, మంచిర్యాల



# తబితా

## (సంఘంలో సత్క్రియలు చేసిన శిష్యురాలు)

మన జీవితం శ్వాసతో నిండి ఉన్నట్లే, విశ్వాసుల జీవితాల్లో సత్క్రియలు ఒక ముఖ్యమైన భాగం. సత్క్రియలు లేని విశ్వాసం మృతమైనది. క్రీస్తుయేసు నందు మనకున్న సజీవ విశ్వాసానికి మంచి పనులు పునాది వంటివి. దేవుని ప్రేమను పొందిన మన హృదయాలలో నుండి వెలువడే ప్రకాశిత చర్యలే ఈ సత్క్రియలు. మన విశ్వాసాన్ని మనం వ్యక్తపరచాలనుకుంటే, అది మన మాటల ద్వారా కన్నా మన చేతల ద్వారానే ఎక్కువగా తెలియజేయాలి. దేవుని కృపను పొందిన మనం ఇప్పుడు ఆ కృపను ఇతరులకు చూపించాల్సిన అవసరం ఉంది, అదే సత్క్రియలు! కాబట్టి, మన విశ్వాసం సజీవంగా ఉందో లేదో తెలుసుకోవడానికి సత్క్రియలు ఒక గొప్ప కొలమానం. మనం చేసే ప్రతి మంచి పని ఇతరులకు దేవుని ప్రేమను పంచే మార్గంగా ఉండాలి.

### కీలకమైన రెండు బాధ్యతలలో ఒకటి

రక్షించబడిన ప్రతి విశ్వాసి ప్రాథమికంగా రెండు ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించవలసి ఉంటుంది. అవి 1. సువార్త ప్రకటించడం 2. సత్క్రియలు చేయడం

దేవుడు బైబిల్‌లో సత్క్రియల గురించి మొదటి సారిగా ఆదికాండము 4:7లో ప్రస్తావించాడు.

“నీవు సత్క్రియ చేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయనియెడల వాకిట పాపము పొంచి యుండును”

దీని అర్థం ఏమిటంటే, మనం మంచి పనులు చేస్తే మన తల ఎత్తుకుని ధైర్యంగా ఉండవచ్చు. సత్క్రియలు మనకు గౌరవాన్ని, సంతోషాన్ని తెస్తాయి. మనం మంచి పనులు చేయనప్పుడు పాపం మనల్ని ఆవరించే ప్రమాదం ఉంది.

## సత్క్రియలు అంటే ఏమిటి?

“సత్క్రియలు చేయాలి” అని మనం తరచుగా వింటుంటాం. అసలు సత్క్రియలు అంటే ఏమిటి?

‘సత్క్రియలు’ అంటే బైబిల్ సూత్రాలకు అనుగుణంగా, దేవుని దయకు కృతజ్ఞతగా, మన విశ్వాసాన్ని చాటుతూ, మన చుట్టూ ఉన్నవారి అవసరాలను తీర్చడానికి ప్రేమతో చేసే పనులే సత్క్రియలు. ఇవి ఒక సువార్త కరపత్రం లాంటివి. ఒక విధంగా చెప్పాలంటే, మన చేతల ద్వారా దేవుని ప్రేమను తెలియజేయడమే సత్క్రియలు.

నూతన నిబంధనలో సత్క్రియల గురించి 15 సార్లు ప్రస్తావించబడింది. యేసు ప్రభువు కూడా తన పరిచర్యలో సువార్తతో పాటు ఎన్నో సత్క్రియలు చేశాడు. ఉదా: కుంటివారిని, గ్రుడ్డివారిని, కుష్ఠురోగులను బాగుచేసి స్వస్థపరిచాడు.

## బైబిల్‌లో సత్క్రియలకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన వచనాలు

1. **మత్తయి 5:16:** మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి.
   మనం చేసే మంచి పనులు ఇతరులకు దేవుని గురించి తెలియజేస్తాయి.
2. **ఎఫెసీ 2:10:** దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తుయేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై యున్నాము.
   సత్క్రియలు చేయడానికి దేవుడే మనలను సిద్ధం చేశాడు.
3. **యాకోబు 2:14-17:** విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతిమైన దగును.
   విశ్వాసం ఉంటే సరిపోదు, అది క్రియల ద్వారా చూపించాలి.
4. **తీతుకు 3:8:** దేవునియందు విశ్వాసముంచిన వారు సత్క్రియలను శ్రద్ధగా చేయుటయందు మనస్సుంచవలెను.
   విశ్వాసం ఉన్నవారు సత్క్రియలు చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.
5. **తీతుకు 3:14:** మనవారును నిష్ఫలులు కాకుండు నిమిత్తము అవసరమును బట్టి సమయోచితముగా సత్క్రియలను శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను.
   మన చుట్టూ ఉన్నవారి అవసరాలను గుర్తించి, సహాయం చేయడానికి నేర్చుకోవాలి.
6. **సామెతలు 3:27:** మేలు చేయుట నీ చేతనైనప్పుడు దాని పొందదగినవారికి చేయకుండ వెనుకతీయకుము.
   సహాయం చేయగలిగినప్పుడు వెనకాడకూడదు.
7. **2 కొరింథీ 5:10:** ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందును.
   మనం చేసే ప్రతి పనికి ఫలితం ఉంటుంది.
8. **గలతీ 6:9,10:** మనము మేలు చేయుటయందు విసుకక యుందము; మనము అలయక మేలు చేసితిమేని తగినకాలమందు పంట కోతుము. కాబట్టి మనకు సమయము దొరికినకొలది అందరియెడలను... మేలు చేయుదము.
   మంచి పనులు చేస్తూ ఉండాలి, వాటి ఫలితం తప్పకుండా ఉంటుంది.

రక్షణ పొందిన ప్రతి విశ్వాసి ముఖ్యంగా క్రీస్తు పునరుత్థాన శక్తిని అనుభవిస్తున్న మనం

సత్క్రియలు చేసే విషయంలో ఎంతో శ్రద్ధ కలిగి నేర్చుకోవాలి. అనేకమంది మిషనరీలు మన దేశాన్ని, దేశ ప్రజలను ప్రేమించి, వారి దేశాలను విడిచిపెట్టి, దేశం కాని దేశాల్లో సత్క్రియలు చేస్తూ సువార్త పరిచర్య చేసినవారెందరో. నిజమైన మారుమనస్సు పొందిన ప్రతి విశ్వాసి సత్క్రియలు చేసే విషయంలో ఎంతో మెలకువ కలిగి ఉంటాడు.

క్రీస్తు పునరుత్థాన శక్తి మనం చేయవలసిన విషయాల కోసం మనలను సిద్ధపరుస్తుంది. పునరుత్థాన శక్తిని బట్టి మాత్రమే మనం వ్యక్తుల్ని ప్రేమించగలుగుతాం, క్షమించగలుగుతాం, అంగీకరించగలుగుతాం, వ్యక్తుల పట్ల దాతృత్వాన్ని చూపించగలుగుతాం.

## సత్క్రియలు ఎలా చేయాలి?

సత్క్రియలు చేయడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న పనుల ద్వారా కూడా మనం దేవుని ప్రేమను చూపించవచ్చు. చిరునవ్వుతో పలకరించడం, సహాయం అడిగినవారికి సాయం చేయడం, ఓదార్పు అవసరమైన వారికి మంచి మాటలు చెప్పడం కూడా సత్క్రియలే.

ముఖ్యంగా, సత్క్రియలు చేసేటప్పుడు మనస్సులో స్వార్థం ఉండకూడదు. నిస్వార్థంగా, ప్రేమతో చేసిన సత్క్రియలే దేవునికి ప్రీతికరమైనవి.

దేవుడు మనకు ఇచ్చిన సమయాన్ని, శక్తిని సత్క్రియల కోసం ఉపయోగిద్దాం. మన చుట్టూ ఉన్నవారికి సహాయం చేస్తూ, దేవుని ప్రేమను పంచుదాం.

“మనము సత్క్రియలు చేయుటకు క్రీస్తుయేసు నందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పని అయియున్నాము.” ఎఫెసీ 2:10

ఈ మాటలను గుర్తుంచుకొని, సత్క్రియలు చేస్తూ దేవుని మహిమను చాటుదాం.

## తబితా – సత్క్రియలకు నిలువెత్తు నిదర్శనం

బైబిల్లో మగ్దలేనే మరియ, యోహానా, సూసన్నా, సలోమి వంటి స్త్రీ శిష్యురాండ్రను మనం చూడవచ్చు. వారిలో విధవరాలు, దీనురాలు, అతి సామాన్యమైన స్త్రీ తబితా అనబడిన దొర్కా ఒకరు. అపో. కార్య. 9:36-42లో తబితా గురించి స్పష్టంగా పేర్కొనబడింది. ఈమె సత్క్రియలను ధర్మకార్యములను బహుగా చేసేది. పేదలకు, విధవరాండ్రకు తనకు వచ్చిన కుట్టుపని సహాయంతో అంగీలు, వస్త్రములను కుట్టి ఇచ్చేది. తబితా ఎంతో చురుకైన స్త్రీ శిష్యురాలు.

ఒకరోజు, యొప్పేలో ఆమె అనారోగ్యంతో మరణించింది. అక్కడ ఉన్న సంఘస్థులు, కొంత మంది శిష్యులు యొప్పేకు దగ్గరలో (17 కి.మీ) ఉన్న లుద్ద అనే ప్రదేశంలో పేతురు ఉన్నాడని విని, అతను వచ్చి తబితాను బ్రతికించమని ఇద్దరు శిష్యులను పంపించారు. పేతురు వారితో పాటు అక్కడికి వచ్చినప్పుడు, విధవరాండ్రందరు వచ్చి యేడ్చుచు, తబితా తమతో ఉన్నప్పుడు కుట్టిన అంగీలును వస్త్రములును అతనికి చూపించారు. తబితా చనిపోయి నప్పటికీ ఆమె సత్క్రియలు మాట్లాడుతున్నాయి. వ్యక్తులు చనిపోయినా, వారి సత్క్రియలు ఎన్నటికీ నిలిచి ఉంటాయనే విషయాన్ని మనం ఇక్కడ గమనించవచ్చు.

పేతురు ప్రార్థన చేసి తబితాను బ్రతికించి, అక్కడ ఉన్న పరిశుద్ధులు, విధవరాండ్రకు ఆమెను సజీవురాలనుగా అప్పగించెను. ఈ విషయం యొప్పేలో ప్రజలు తెలిసికొని, అనేకులు ప్రభువు నందు విశ్వాసముంచారు. కాబట్టి, మన జీవితంలో సత్క్రియలు ఎంత ముఖ్యమో మనం తెలుసుకోవచ్చు.

## సత్క్రియల ద్వారా సేవ

విలియం కేరీ ఇంగ్లాండు నుండి భారతదేశానికి వచ్చి “దేవుని నుండి గొప్ప విషయాలు ఆశించు దేవుని కోసం గొప్ప విషయాలు ప్రయత్నించు” అనే నినాదంతో 41 సంవత్సరాలు భారతదేశంలో ఎన్నో సత్క్రియలు చేశాడు. సేవింగ్స్ బ్యాంకును ప్రారంభించుట, స్టీమ్ ఇంజన్ను పరిచయం

చేయడం, ముద్రణాయంత్రం, వార్తాపత్రిక, నిఘంటువులు, వ్యాకరణ పుస్తకాలు తర్జుమా, బైబిల్ అనువాదం, పాఠశాలలు, కళాశాలలు స్థాపించటం, మహిళా హక్కుల కోసం పోరాటం (శిశుహత్యలు, నిరక్షరాస్యత, సతీసహగమనం, కుష్ఠురోగులకు వైద్యశాల, వ్యవసాయతోటల సొసైటీ...) వంటి ఎన్నో గొప్ప పనులు చేశారు.

కేరీ ఇంకా ఎన్నో అద్వితీయ సత్క్రియలు చేశారు. విశ్వాసులంగా మనం కూడా మన గృహంలో, మనచుట్టూ ఉన్న సమాజంలో, సంఘంలో, పరిచర్యలో అవసరాన్ని గుర్తించి సత్క్రియలు చేయాలి. సత్క్రియలు చేస్తూ సువార్త ప్రకటించినప్పుడు ఖచ్చితంగా మంచి ఫలితాన్ని చూడగలుగుతాం. చీకటిలో ఉన్న అనేకమంది వ్యక్తులకు సువార్త ప్రకటించడానికి ఆ భారం మనలను సత్క్రియలు చేసేదిగా ప్రోత్సహిస్తుంది.

వాడ్ అండ్ డీడ్, వరల్డ్ విజన్, క్రిస్టియన్ ఎన్జిఓస్ లాంటి సంస్థలు కూడా సత్క్రియల ద్వారా సమాజానికి సేవ చేస్తూ సువార్తను ప్రకటిస్తున్నాయి. వాటి సేవలను మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

మన తరంలోని అవసరాల కొరకు దేవుని పునరుత్థానశక్తి చేత సత్క్రియలు చేసే విషయంలో మనం ఎక్కడ ఉన్నాం? మనలో మెలకువగా ఉండి సత్క్రియలు చేసే వారెంతమంది? ఆలోచించండి!

### మన బాధ్యత ఏమిటి?

సత్క్రియలు అనేవి పెద్దదైనా, చిన్నదైనా దేవుని కృపను ప్రతిబింబించేవిగా ఉండాలి అవి మతపరమైనవి కావచ్చు, కాకపోవచ్చు. ఉదాహరణకు,

- అనారోగ్యంతో ఉన్న వారిని పరామర్శించడం.
- ఇంట్లో పనిచేసేవారికి వారానికి ఒకరోజు సెలవు ఇవ్వడం.
- వారి కుటుంబ అవసరాలు తెలుసుకొని సహాయం చేయడం.
- వారు సెలవులు పెట్టినప్పటికీ పూర్తి జీతం ఇవ్వడం.
- అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ బాగాలేనప్పుడు ఒకరోజు భోజనం చేసి పెట్టడం.
- పిల్లల పుట్టినరోజు వేడుకకు వారిని పిలిచి సువార్త చెప్పడం.

ఇలాంటి చిన్న చిన్న సత్క్రియల ద్వారా మనం దేవుని నామాన్ని మహిమపరచవచ్చు.

మనం చేసే సత్క్రియలను మన పిల్లలు, కుటుంబసభ్యులు గమనిస్తారు. మనం వారికి ఆదర్శంగా నిలుస్తాం. మనం మంచి పనులు చేస్తుంటే, వారు కూడా వాటిని అనుసరిస్తారు.

### ముగింపు

ప్రస్తుతం మనకు ఎన్నో సవాళ్లు ఉండవచ్చు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యాలు, ఉద్యోగ సమస్యలు, చదువుకు సంబంధించిన ఒత్తిడులు మనల్ని చుట్టుముట్టి ఉండవచ్చు. కానీ, ఇలాంటి పరిస్థితుల్లో కూడా మనం సత్క్రియలు చేస్తూ, సువార్తను ప్రకటిస్తూ దేవుని వెలుగును లోకానికి చాటాలి. వ్యక్తిగతంగా, కుటుంబంగా సత్క్రియలు చేయడానికి దేవుడు మనల్ని సిద్ధపరచును గాక!

దేవునికి స్తోత్రం అని వల్లేవేస్తూ ప్రార్థనలు చేయడమే కాదు, సత్క్రియలు చేయడానికి కూడా దేవుడు మనల్ని ఏర్పాటు చేసుకున్నాడు. మనం చేసే ప్రతి మంచి పని దేవునికి మనం అర్పించే కానుక.

మనం చేసే చిన్న సహాయం కూడా ఎంతో విలువైనది. దేవుడు మనకు సత్క్రియలు చేయడానికి శక్తినివ్వాలని కోరుకుందాం. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో విశ్వాసంతో సత్క్రియలు శ్రద్ధగా చేయడానికి త్రియేక దేవుడు మనల్ని ప్రోత్సహించును గాక!

– త్రివేణి శ్రీను
రామాంతపూర్ జోన్, హైదరాబాద్

# రెవరెండ్ చార్లెస్ మీడ్

## ట్రావెన్‌కోర్ మిషన్ పితామహుడు

(1792 - 1873)



రెవరెండ్ చార్లెస్ మీడ్ ఒక మిషనరీ, విద్యావేత్త, గొప్ప సంఘ సంస్కర్త. దక్షిణ భారతదేశంలోని ట్రావెన్‌కోర్ సంస్థానంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. దక్షిణ భారతదేశంలోని ఒకప్పుడు సంస్థానంగా ఉన్న ట్రావెన్‌కోర్ నేటి కేరళ రాష్ట్రంలో భాగంగా ఉంది. ఒకప్పుడు దీనిని రాజకుటుంబం పాలించేది. తిరువనంతపురం (త్రివేండ్రం) దీని రాజధాని. 18వ శతాబ్దం మధ్యలో ఈ రాజ్యం ఏర్పడింది. 1949 వరకు కొనసాగింది. చార్లెస్ మీడ్ లండన్ మిషనరీ సొసైటీ (ఎల్ఎంఎస్) తరపున ట్రావెన్‌కోర్‌కు పయనీరింగ్ మిషనరీగా వచ్చిన విలియం టోబియాస్ రింగెల్టాబ్ అడుగుజాడల్లో నడిచాడు. పాశ్చాత్య విద్యకు పునాదులు వేశాడు. బానిసత్వం, వెట్టి చాకిరి (బలవంతపు శ్రమ) నిర్మూలనకు కృషి చేశాడు. నిమ్న కులాల మహిళలకు గౌరవం, హక్కులను సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అందుకే ఆయనను భారతదేశ మిషనరీ చరిత్రలో దక్షిణ ట్రావెన్‌కోర్ మిషన్ పితామహుడిగా పిలుస్తారు.

### కుటుంబ నేపథ్యం

చార్లెస్ మీడ్ 1792 అక్టోబరు 2న ఇంగ్లాండులోని గ్లౌసెస్టర్ కౌంటీలోని బ్రిస్టల్‌లో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు ఆంగ్లికన్ క్రైస్తవులు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో, యార్క్ షైర్‌లోని వేక్ ఫీల్డ్‌లో పాస్టర్‌గా పనిచేస్తున్న ఆయన మేనమామ రెవరెండ్ జాన్ హంట్, చార్లెస్ మీడ్‌ను పెంచి పెద్ద చేశాడు. మీడ్ తన పాఠశాల విద్యను గోస్పోర్ట్ మిషనరీ పాఠశాలలో పూర్తి చేశాడు. ఆ తరువాత సైన్యంలో చేరాలా లేక లండన్ మిషనరీ సొసైటీలో పనిచేయాలా అనే సందిగ్ధంలో పడ్డాడు. చివరకు ఆయన వేదాంతశాస్త్రాన్ని అభ్యసించాలని నిర్ణయించుకున్నాడు. 1816 మార్చి 6న చిచెస్టర్ ప్రార్థనా మందిరంలో పాస్టర్‌గా నియమించబడ్డాడు. చార్లెస్ మీడ్‌కు చిన్నప్పటి నుండి యాంత్రిక వృత్తుల పట్ల ఆసక్తి ఉండేది. మిషనరీగా తన వృత్తికి సన్నాహకంగా వడ్రంగి పని, టైప్ కటింగ్, కంపోజింగ్, ప్రింటింగ్ పనులు, కాగితం తయారీ, నేత, కోయడం, ఫోర్జరీ పనిలో తన నైపుణ్యాన్ని మెరుగుపరచుకున్నాడు.

### భారతదేశానికి మిషనరీగా ప్రయాణం

చార్లెస్ మీడ్, తన మేనమామ జాన్ హంట్ కుమార్తె అయిన అన్నే హంట్‌ను వివాహం చేసుకున్నాడు. లండన్ మిషన్ సొసైటీ నివేదిక ప్రకారం, రింగెల్టాబ్ వారసుడిగా మీడ్ ట్రావెన్ కోర్‌కు నామినేట్ చేయబడ్డాడు. మీడ్, అన్నే, మీడ్‌కు అత్యంత సన్నిహితుడైన రిచర్డ్ క్నిల్‌లు 1816 ఏప్రిల్ 20న ఇంగ్లాండును వదిలి ట్రావెన్‌కోర్‌కు బయలుదేరి 1816 ఆగస్టు 28న మద్రాసు చేరుకున్నారు.

మద్రాసులో ఎల్.ఎం.ఎస్ మిషనరీ రెవరెండ్

లవ్లెస్ ఆయనకు స్వాగతం పలికారు. అయితే, అన్నే ఊపిరితిత్తుల వ్యాధికి గురవ్వడం, ఆమె గర్భవతి కావడంతో రెవరెండ్ మీడ్ కొంతకాలం రెవరెండ్ లవ్లెస్ ఇంట్లోనే ఉండవలసి వచ్చింది. ఈ సమయాన్ని ఆయన సద్వినియోగం చేసుకుని తమిళంలో పాఠాలు నేర్చుకోవడం ప్రారంభించాడు. మిషన్ పాఠశాలలను సందర్శించేవాడు. లవ్లెస్, క్నిల్‌తో కలిసి వారానికి నాలుగు నుండి ఎనిమిది సార్లు సువార్తను బోధించేవాడు. ప్రార్థనా సమావేశాలు నిర్వహించే వాడు.

తన రాక గురించి కల్నల్ మున్రోకు ముందస్తు సమాచారం ఇచ్చి, మిషన్ వ్యవహారాలకు సంబంధించిన వివిధ విషయాలపై సంప్రదించి సహాయం కోరాడు. ఒక సంవత్సరం తరువాత, ఆయన తన భార్యతో కలిసి 1817 సెప్టెంబర్ 9న మద్రాస్ నుండి ట్రావెన్‌కోర్‌కు బయలుదేరి, 1818 జనవరి 17న కొలాచెల్ చేరుకున్నాడు. అక్కడ ఆయన భార్య దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా ఒక బిడ్డను ప్రసవించి మరణించింది.

## మైలాడీ మిషన్ స్థాపన

మైలాడీ మిషన్ స్థాపన అనేది ఒక చారిత్రాత్మక ఘట్టం. క్రైస్తవుల సహాయంతో మీడ్ మైలాడీకి చేరుకున్నాడు. విదేశీ మిషనరీలు లేని సమయంలో, దాదాపు రెండు సంవత్సరాలు ఆ మిషన్ ఖాళీగా ఉన్నప్పటికీ, వేదమాణిక్కం తన పనిని నమ్మకంగా, విజయవంతంగా కొనసాగించాడు. ప్రజలు తమ పనులలో ఎంత నమ్మకంగా ఉన్నారో ఆయన గుర్తించాడు.

అక్కడ రెవరెండ్ రింగెల్టాబ్ నివాసంలో మీడ్ కొంతకాలం ఉన్నాడు. క్రైస్తవులు, మిషన్ ఆస్తుల గురించి వేదమాణిక్కం నుండి సమాచారం సేకరించిన తరువాత, తన రాక గురించి బ్రిటిష్ రెసిడెంట్ కల్నల్ మున్రోకు తెలియజేశాడు. రెవరెండ్ మీడ్ మద్రాస్ నుండి బయలుదేరే ముందు, కల్నల్ మున్రో దక్షిణ సర్కార్ అధికారులకు వేదమాణిక్కంతో సంప్రదించి, మైలాడీలోని చిన్న మిషన్ హౌస్‌ను మరమ్మతులు చేయమని ఆదేశించాడు. కొన్ని మార్పులు కూడా సూచించాడు. రెవరెండ్ మీడ్ మద్రాస్ నుండి బయలుదేరే సమయానికి, మైలాడీ మిషన్ హౌస్ సిద్ధంగా ఉంది. కానీ, సముద్రయానంలో రెవరెండ్ మీడ్ ఎదుర్కొన్న విషాదకరమైన విపత్తు గురించి కల్నల్ మున్రోకు తెలియదు. ఆ బాధాకరమైన సమయంలో, అతని బిడ్డ జాన్ హంట్ మాత్రమే అతనికి ఉన్న ఒకే ఒక్క ఓదార్పు.

మైలాడీకి చేరుకున్న తరువాత, మీడ్ దృష్టి మిషన్ యొక్క విస్తారమైన పొలాల నుండి వచ్చే ఉత్పత్తులు వృథా కాకుండా నిరోధించడంపై కేంద్రీకరించాడు. అందుకోసం ఒక కేంద్ర వరి ధాన్యాగారాన్ని ఏర్పాటు చేశాడు. కొరత సమయంలో, పేదలకు తక్కువ ధరలకే ఆహారాన్ని అందించడంతో వారికి ఎంతో ఊరట లభించింది. ఈ సంస్థకు నిర్వాహకులుగా వేదమాణిక్కం కుటుంబం నియమించబడింది.

## దక్షిణ ట్రావెన్‌కోర్ మిషన్

మీడ్ మృదు స్వభావి. సమాజంలో బలహీన వర్గాల వారికి అన్యాయం జరుగుతున్న పరిస్థితులను చూసి చలించిపోయాడు. ఉన్నత కుల న్యాయమూర్తులు తక్కువ కులస్తులకు తరచుగా అన్యాయం చేస్తున్నారని గ్రహించాడు. దీనిని పరిష్కరించడానికి కల్నల్ మన్రో ట్రావెన్‌కోర్ రాణితో మాట్లాడి, మీడ్‌ను సివిల్ మరియు డిస్ట్రిక్ట్ జడ్జిగా నియమించాడు. మిషనరీగా మీడ్‌కు ఉన్న క్రైస్తవ న్యాయ భావనను ఆయన పరోక్షంగా విశ్వసించాడు. ఇది ఒక ప్రత్యేకమైన ప్రయోగం. ఏప్రిల్ 1818లో మీడ్ తన స్థావరాన్ని నాగర్‌కోయిల్‌కు మార్చవలసి వచ్చింది. నాగర్‌కోయిల్ కొట్టార్, వడస్సేరి మరియు కృష్ణన్‌కోయిల్ వంటి పట్టణాలకు కేంద్రంగా ఉందని మీడ్ గ్రహించాడు. వాటిని మిషన్ క్షేత్రాలుగా భావించాడు. ఈ గ్రామాలకు చేరుకోవడానికి, మీడ్ తనతో పాటు మైలాడి నుండి పది మంది యువకులను తీసుకువచ్చి వారికి శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. క్నిల్ సహాయంతో అది చివరికి నాగర్‌కోయిల్ సెమినరీగా మారింది. కానీ, లండన్ మిషనరీ సొసైటీ (ఎల్ఎంఎస్) మీడ్‌ను రెండు కెరీర్‌లలో ఒకదాన్ని ఎంచుకోమని కోరింది. మీడ్ సంతోషంగా మిషనరీగా ఉండటానికి ఇష్టపడి 1820లో తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

## నాగర్‌కోయిల్ చర్చి నిర్మాణం

న్యాయమూర్తిగా నియమితులైన సమయంలోనే మీడ్ నాగర్‌కోయిల్‌లో ఒక పెద్ద చర్చిని నిర్మిం

చాలని అనుకున్నాడు. క్రైస్తవ కుటుంబాల సంఖ్య కేవలం డజను మాత్రమే ఉన్నప్పటికీ, 3000 మంది పట్టే భవన నిర్మాణానికి ప్రణాళికలు రచించడం ఆయన విశ్వాసానికి నిదర్శనం. పునాది తవ్వి గ్రానైట్ రాళ్లను మిషన్ ఆవరణకు తరలించడానికి కోర్టు జైలులోని ఖైదీలందరినీ వ్యూహాత్మకంగా ఉపయోగించుకున్నాడు. నిర్మాణ సమయంలో ట్రావెన్‌కోర్ రాజు, రాణి మరియు కొచ్చిన్ రాజు గణనీయమైన విరాళాలు ఇచ్చి మీడ్‌కు మద్దతు తెలిపారు. నేడు కాల్‌కోవిల్ లేదా రాతి చర్చి అని పిలువబడే ఈ చర్చి, మీడ్ మేథోశక్తికి గొప్ప నిదర్శనం. ఇది చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సియస్ఐ) హెూమ్ చర్చ్‌గా పిలువబడుతుంది. ఈ చర్చి నిర్మాణం మీడ్ అంకితభావానికి, పట్టుదలకు ఒక గొప్ప ఉదాహరణ.

## విద్యా సంస్థల ఏర్పాటు

దక్షిణ భారతదేశంలో విద్యారంగ వికాసానికి పాటుపడిన గొప్ప వ్యక్తి మీడ్. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఒక ఆసక్తిగల విద్యావేత్తగా, ఆయన పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను గమనించేవాడు. 1818 సెప్టెంబర్ 29న, మీడ్ ఎల్.ఎం.ఎల్‌కు చెందిన రిచర్డ్ క్నిల్‌తో కలిసి సంఘం ఉన్న ప్రతి గ్రామంలో పర్యటించి అక్కడి పరిస్థితులను సర్వే చేశాడు. ఆ సమయంలో గ్రామాల్లో పాఠశాలల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. దీనిని చూసి చలించిన మిషన్ వెంటనే 1818లో పది పాఠశాలలను స్థాపించింది.

అప్పటి రోజుల్లో విద్య అనేది కేవలం ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితమైన హక్కు. కానీ మీడ్ కులమత భేదం లేకుండా అందరినీ మిషన్ స్కూళ్లకు ఆహ్వానించాడు. అంతేకాకుండా, పాఠశాలకు వచ్చే ప్రతి బానిస అబ్బాయికి ఉపాధ్యాయుడు తన జీతం నుండి ఒక రూపాయి, బానిస అమ్మాయికి రూపాయిన్నర ఇవ్వాలని మీడ్ ప్రకటించాడు. దీంతో ఒక సంవత్సరంలోనే నెయ్యూర్ జిల్లాలోని పాఠశాలలో 1000 మందికి పైగా బానిస పిల్లలు చేరారు.

క్రైస్తవేతరులు తమ పిల్లలను క్రైస్తవులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులు చదివే మిషనరీ పాఠశాలలకు పంపడానికి విముఖత చూపారు. అలాంటి కుటుంబాలకు చెందిన విద్యార్థులను విద్యావంతులను చేయడానికి మీడ్ నాగర్‌కోయిల్‌లోని బజారులో ఒక పాఠశాల గదిని నిర్మించి, దానికి 'బజార్ పాఠశాల' అని నామకరణం చేశాడు. ఇక్కడ సాధారణ విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, లేఖలు రాయడం వంటివి నేర్పించేవారు.

## పునర్వివాహం–మహిళా విద్యకై కృషి

మీడ్ జనవరి 13, 1819న దక్షిణ ట్రావెన్‌కోర్‌లో సేవ చేసిన మొదటి మహిళా మిషనరీ అయిన జోహన్నా కోలెస్టినాను వివాహం చేసుకున్నాడు. ఆమె తంజావూరులో మిషనరీగా పనిచేసిన రెవరెండ్ హెూర్స్ట్ కుమార్తె.

జోహన్నా మీడ్ 1819 అక్టోబర్‌లో నాగర్ కోయిల్‌లో బాలికల కోసం ఒక బోర్డింగ్ పాఠశాలను ప్రారంభించింది. ఇది పూర్తిగా సబ్సిడీతో నడిచేది. ట్రావెన్‌కోర్‌లో మహిళా విద్యకు సంబంధించిన మొట్టమొదటి క్రమబద్ధమైన ప్రయత్నంగా దీనిని చెప్పుకోవచ్చు. ఆ రోజుల్లో స్త్రీ విద్య అంతగా అభివృద్ధి చెందలేదు. అలాంటి పరిస్థితుల్లో జోహన్నా మీడ్ బాలికల కోసం పాఠశాలను ప్రారంభించి, వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి ఒక గొప్ప ముందడుగు వేసింది.

లండన్ మిషన్ సొసైటీ (LMS)కి చెందిన మిషనరీ చార్లెస్ మౌల్ట్ భార్య మార్తా మౌల్ట్ కూడా మీడ్స్‌లో చేరి జోహన్నా మీడ్‌కు సహాయం చేసింది. వారిద్దరూ కలిసి బాలికలకు విద్యాబుద్ధులు నేర్పారు. మీడ్ కుట్టు, స్పిన్నింగ్, అల్లికలు నేర్పించగా, మౌల్ట్ క్రోచెట్, ఎంబ్రాయిడరీ వంటి లలిత కళలను నేర్పించేది. ఈ నైపుణ్యాలు బాలికలకు ఎంతో ఉపయోగపడేవి.

1821లో లేస్ అల్లికను జోహన్నా మీడ్ ప్రవేశపెట్టింది. లేస్ తయారీ లాభదాయకమైన ఆదాయ వనరుగా మారింది. దక్షిణ ట్రావెన్‌కోర్ మిషన్ తయారు చేసిన లేస్‌కు మద్రాసు, లండన్, పారిస్, చికాగో నగరాల్లో బహుమతులు లభించాయి. ఈ విధంగా బాలికలు విద్యతోపాటు చేతి వృత్తుల్లో కూడా నైపుణ్యం సంపాదించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ పాఠశాల ఎంతగానో తోడ్పాటునందించింది.

## ప్రింటింగ్ ప్రెస్ స్థాపన

మీడ్ ఒక ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించాలని నిర్ణయించుకున్నాడు, అది మిషనరీ పనికి ఒక గొప్ప సహాయంగా ఉంటుందని ఆయన భావించాడు. లండన్ లోని ఎల్ఎంఎస్ హోమ్ బోర్డ్ మరియు రెలిజియస్ ట్రాక్ట్ సొసైటీ వారి సహాయంతో, మీడ్ ట్రాంక్యూబార్ మిషన్ నుండి ఆంగ్లం మరియు తమిళం భాషల కోసం ఒక ప్రెస్‌ను, అలాగే కావలసిన అచ్చు పరికరాలను కొనుగోలు చేశాడు. ఒక అనువైన స్థలం కోసం చాలా వెతికినా ఫలితం లేకపోవడంతో, చివరికి ఆయన తన సొంత ఇంట్లోనే ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఈ పనిలో సహాయం చేయడానికి ట్రాంక్యూబార్‌కు చెందిన ప్రింటర్ డేవిడ్ ఆతియప్పన్‌ను నియమించారు. నాగర్ కోయిల్ మిషన్ ప్రెస్‌లో ముద్రించిన మొదటి పుస్తకం పేరు "ఆత్మబోధం" (ఆత్మ బోధకుడు). ఇది ఒక గొప్ప ఆరంభం!

మీడ్ ఆ ప్రెస్‌ను కేవలం ముద్రణకే పరిమితం చేయకుండా, ఒక వృత్తి శిక్షణా కేంద్రంగా కూడా ఉపయోగించాలని నిర్ణయించుకున్నాడు. తద్వారా ఇది చాలా మందికి ఉపయోగపడుతుందని ఆయన ఆలోచన. ట్రైనర్‌గా నియమితులైన ఆతియప్పన్ ప్రింటింగ్, బుక్ బైండింగ్ కోర్సులను నిర్వహించాడు. లండన్‌లోని రిలిజియస్ ట్రాక్ట్ సొసైటీ ప్రతి సంవత్సరం ఉచితంగా కాగితాన్ని అందించడానికి ముందుకు వచ్చింది. అంతేకాకుండా, దిగుమతి సుంకాలు లేకుండా కాగితాన్ని దిగుమతి చేసుకోవడానికి మీడ్‌కు ట్రావెన్ కోర్ ప్రభుత్వం నుండి మినహాయింపు లభించింది. ఆ సమయంలో ట్రావెన్కోర్‌లో ఇది మొదటి, అతిపెద్ద ప్రింటింగ్ ప్రెస్‌గా గుర్తింపు పొందింది. మొదటి ఆరు సంవత్సరాలలోనే నాగర్ కోయిల్ ప్రెస్ ప్రతి సంవత్సరం 30,000 కరపత్రాలను ముద్రించింది.

## వృత్తి విద్యా శిక్షణ పాఠశాల ఏర్పాటు

మీడ్ ఒక వృత్తి విద్యా శిక్షణ పాఠశాలను ప్రారంభించి, దాని ద్వారా స్థానికులకు ఉపయోగపడే నైపుణ్యాలను నేర్పించే ప్రయత్నం చేశాడు. త్వరలోనే ఈ పాఠశాలలో లెదర్ టానింగ్ (తోలు శుద్ధి చేయడం), పట్టు పురుగుల పెంపకం వంటి కోర్సులను కూడా ప్రవేశపెట్టారు.

## ఆదాయ వనరుల అభివృద్ధి

ఆయన మిషన్ ఆదాయాన్ని పెంచడానికి, యూరోపియన్ నాగలిని దిగుమతి చేసుకున్నారు. దీని ద్వారా మిషన్ క్షేత్రాల నుండి మరింత ఎక్కువ ఉత్పత్తిని సాధించవచ్చు. అంతేకాకుండా, ఈ నాగలిని ఇతర స్థానికులతో కూడా పంచుకున్నారు, తద్వారా వారందరూ అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

## క్రైస్తవ గ్రామం ఏర్పాటు

పెరుగుతున్న మిషన్‌ను సంఘటితం చేయడానికి, పేద క్రైస్తవులను ఆదుకోవడానికి మీడ్ రెండు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి, అక్కడ వారిని ఉంచాడు. ఇది ఒక క్రైస్తవ గ్రామంగా అభివృద్ధి చెందింది. కుల వివక్షను రూపుమాపడానికి మీడ్ చేసిన ప్రయత్నాలకు ఇది ఒక ఉదాహరణ. నాగర్‌కోయిల్ మిషన్ కుల వివక్షను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తే, తంజావూరు మిషన్ దీనిని క్రైస్తవ విశ్వాసంలోకి తీసుకువెళ్ళింది. మీడ్ దీనిని గట్టిగా వ్యతిరేకించాడు.

## స్త్రీలకు పై వస్త్రాన్ని రూపొందించుట

ఆ రోజుల్లో కుల వివక్ష ఎంత తీవ్రంగా ఉండేదంటే, నిమ్న కులాల స్త్రీలు తమ పై శరీరాన్ని కప్పుకోవడానికి కూడా అనుమతి ఉండేది కాదు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే వారికి పన్ను విధించేవారు. దీనిని "రొమ్ము పన్ను" అనేవారు. కుల అసమానతలలో ఇది ఒకటి. మీడ్ ఈ అన్యాయాన్ని వ్యతిరేకించారు.

ఈళవులు, పరాయన్లు, పులయన్ వంటి నిమ్న కులాల స్త్రీలు క్రైస్తవ మతం స్వీకరించినప్పుడు, మిషనరీ భార్యలు వారికి బ్లౌజ్, భుజం వస్త్రాన్ని రూపొందించి ఇచ్చేవారు. అయితే, ఇది సమాజంలో కొంతమందికి నచ్చలేదు. మే 1822లో, కొందరు వ్యక్తులు పై వస్త్రం ధరించిన దిగువ కులాల క్రైస్తవ మహిళలపై బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తించేవారు. మీడ్ వెంటనే దిగువ కోర్టుకు ఫిర్యాదు చేశాడు. కోర్టు మీడ్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది, కానీ 1827లో ఆ తీర్పును తారుమారు చేశారు. దీనికి వ్యతిరేకంగా 1855-1859లో "పై వస్త్ర తిరుగుబాటు" జరగడంతో మరలా అల్లర్లు చెలరేగాయి.

## నెయ్యూర్ మిషన్ ఏర్పాటు

1825లో ఆరోగ్యం క్షీణించడంతో మీడ్ నాగర్‌కోయిల్‌ను వదిలి తంజావూరు, కుంభకోణం లకు వెళ్లాడు. అక్కడ మే నెలలో ఒక కొత్త మిషన్ స్టేషన్‌ను ఏర్పాటు చేశాడు. దేవరామ్ బిడ్డుల్ఫ్‌తో సహా ఆరుగురు మిషన్ ఏజెంట్లు ఆయనకు సహాయకులుగా ఉన్నారు. 1828లో, మిషన్ తూర్పు, పశ్చిమ విభాగాలుగా విభజించబడింది. నాగర్‌కోయిల్‌కు పశ్చిమాన తిరువనంతపురం వరకు ఉన్న ప్రాంతం మీడ్ భూభాగంగా నెయ్యూర్ మిషన్‌గా మారింది. ఇక్కడ అనేక క్రైస్తవ కుటుంబాలు, ముఖ్యంగా అణగారిన పులయ కులాల వారు స్థిరపడ్డారు. జొహన్నా మీడ్ ఇక్కడ బాలికల కోసం ఒక బోర్డింగ్ పాఠశాలను కూడా స్థాపించింది.

## బానిసత్వ నిర్మూలనకై కృషి

ఒకప్పుడు ట్రావెన్‌కోర్ ప్రాంతంలో నిమ్న కులాల ప్రజలు అనేక కష్టాలు అనుభవించేవారు. వారిని పట్టి పీడించిన మరో రుగ్మత వేతనాలు లేకుండా బలవంతంగా శ్రమ చేయించుకోవడం. దీనినే 'ఊజియాం' అనేవారు. ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులకు లోడ్లు మోయాలన్నా, ప్రజల కోసం షెడ్లు వేయాలన్నా అటు ప్రభుత్వానికి, అగ్రవర్ణాలకు నిమ్న కులాల ప్రజలు ఉచితంగా పనిచేయాల్సి వచ్చేది. కార్మికులు తమ శరీరాన్ని నియంత్రించడానికి తక్కువ పరిమాణంలో ఆహారాన్ని పొందేవారు.

అలాంటి పరిస్థితుల్లో కల్నల్ మెకాలే, కల్నల్ జాన్ మన్రో వంటి బ్రిటీష్ అధికారులు మీడ్‌కు సహాయం చేశారు. దీంతో మీడ్ క్రైస్తవ మిషనరీల ద్వారా బానిసలకు చదువు చెప్పించాడు. ఊజియాం సేవకులకు ఉపాధి కల్పించి బానిస కులాల ప్రజల్లో వారి హక్కుల గురించి, వారికి ఉన్న విశేషాధికారాల గురించి అవగాహన కల్పించాడు. క్రైస్తవ మిషనరీలు చేసిన ప్రయత్నాల మొదటి ఫలితంగా 1843లో కేరళలో బానిసత్వ నిర్మూలన చట్టం చేయబడింది.

అయితే, "పై వస్త్ర తిరుగుబాటు", బానిసత్వ నిర్మూలన చట్టం కొంతమంది అగ్ర కులాల వారికి ఇది నచ్చలేదు. దాంతో వాళ్లు మీడ్ మీద కోపం పెంచుకున్నారు. నెయ్యూర్ మిషన్‌ను తగలబెట్టడానికి, మీడ్‌ను చంపడానికి ప్రయత్నిం చారు. జనవరి 3, 1829 అర్ధరాత్రి మీడ్‌కు ఈ విషయం తెలియడంతో వెంటనే ఆయన చుట్టుపక్కల ఉన్న మత్స్యకార గ్రామస్తుల నుండి, ఉదఘెర్రీ కోటలోని బ్రిటీష్ కమాండర్ నుండి సహాయం తీసుకున్నాడు.

## ముగింపు

1836లో మీడ్ లండన్ వెళ్ళినప్పుడు, ఎల్ఎమ్ఎస్ డైరెక్టర్లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. 1838లో ఆయనతో పాటు మరో ఐదుగురు మిషనరీలు తిరిగి వచ్చారు. కానీ, కాలేయ వ్యాధి కారణంగా మీడ్ భార్య జోహన్నా 1848 ఫిబ్రవరి 6న నెయ్యూరులో మరణించింది. ఆమె వయస్సు 45 సంవత్సరాలు.

1853లో మీడ్ తన ముఖ్య సహాయకుడైన దేవరామ్ బిడ్డుల్ఫ్ కుమార్తె లూయిసాను మూడవ వివాహం చేసుకున్నాడు. ఆమె తక్కువ కులానికి చెందిన భారతీయ స్త్రీ కావడంతో మిషన్ ఏజెన్సీకి, మిషనరీ కమ్యూనిటీకి మధ్య వివాదానికి కారణమైంది. దాంతో మీడ్ తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కానీ, ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఎల్ఎంఎస్ సంస్థ కృతజ్ఞగా జీవితకాల పెన్షన్ మంజూరు చేసింది.


మీడ్‌కు గొప్ప స్నేహితుడైన బ్రిటీష్ రెసిడెంట్ జనరల్ కల్లెన్ అతన్ని తిరువనంతపురానికి ఆహ్వానించాడు. అక్కడ మీడ్ ప్రభుత్వ పాఠశాలల మరియు ప్రెస్ సూపరింటెండెంట్‌గా నియమితుల య్యాడు. మీడ్ జనవరి 19, 1873న 80 సంవత్సరాల వయస్సులో తిరువనంతపురంలో మరణించాడు.

క్రీస్తు ప్రేమను ప్రకటించే క్రైస్తవ సంఘాలు సమాజంలో అణగారిన ప్రజల అభివృద్ధికి కృషి చేయాలి. తోటి ప్రజలను ప్రేమించడం మన కర్తవ్యం. క్రీస్తు గొప్ప ఆశయాలను మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపించాలి. మీడ్ జీవితం మనకు ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణ. ఆయన బానిసత్వం నిర్మూలన కోసం చేసిన కృషి ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటుంది.

(పై వ్యాసం ఇంటర్నెట్ వనరుల నుండి సేకరించబడినది)

– రూత్ వినయ్,
ప్రగతినగర్, సైబరాబాద్

# జూన్ '25 యెహెజ్కేలు గ్రంథము (7 – 8 అధ్యాయాలు)




**అడ్డం**

1. అప్పుడు ఏ ద్వారము దగ్గర యెహెజ్కేలును ఆయన దింపాడు?
4. దేశము దేనితో నిండియున్నది?
5. నేను యెహోవానై యున్నానని నీ వెరుగునట్లు నీవు ఏమి అనుభవింపజేసెదవు?
8. ఇశ్రాయేలీయుల దేశమునకు ఏమి వచ్చి యున్నది?
9. జనులు దేని కొరకు విచారించుచున్నారు గాని అది వారికి దొరకదు?
11. శృంగారమైన ఆ యాభరణమును వారు దేనికి ఆధారము ఉపయోగించిరి?
12. స్త్రీలు కూర్చుండి ఏ దేవతను గూర్చి యేడ్చుట చూచితిని?

**నిలువు**

1. ఏ సంవత్సరమున ప్రభువైన యెహోవా హస్తము నామీదికి వచ్చెను అని యెహెజ్కేలు చెప్పున్నారు?
2. ఆయన సెలవియ్యగా గోడకు కన్నము త్రవ్వినంతలో ఏమి కనబడెను?
3. కొనువారికి ఏమి వుండ పనిలేదు?
6. నేను యెహోవానై యున్నానని వారు తెలిసికొనునట్లు వారికి ఏ ఫలము నేను వారి మీదికి రప్పింపబోవుచున్నాను అని దేవుడు చెప్పున్నారు?
7. ఈ దర్శనము ఎవరికి చెందును?
10. వారిని చూడకుండ ఏమి త్రిప్పుకొందును అని దేవుడు చెప్పున్నారు?

– కె.కిరణ్ కుమార్, స్టాఫ్, మహబూబ్‌నగర్

### మే '25 యెహెజ్కేలు గ్రంథము (5 – 6 అధ్యాయాలు)

**అడ్డం:** 1.అపవిత్రపరచితివి 3.తెగులు చేత 4.బొమ్మల యెదుట 6.మంగలకత్తి 8.అయ్యో 9.విడువబడును 11.చెదరగొట్టుదును 13.హతులై 14.క్షామము చేత 15.ఇశ్రాయేలు వారిని

**నిలువు:** 2. పర్వతముల తట్టు 5. దుష్ట మృగములను 7. కఠిన హృదయులైతిరి 8.అన్యజనుల మధ్య 10.దిబ్లాతు 12.దుర్మార్గులు 13.హతము

**విజేతలు:** 1.జ్యోతి గంగారాం, కొంపల్లి 2.పి. కావ్య శ్రీ, కాజీపేట్

# ఎంత కష్టం! ఎంత కష్టం!!

ఎంత కష్టం! ఎంత కష్టం!!
అమ్మ కడుపున ప్రాణం పోసుకోవడం,
క్రమశిక్షణలో పెరగడం,
చదువులో రాణించడం.

ఎంత కష్టం! ఎంత కష్టం!!
గురి కలిగి యుండడం,
లక్ష్యం కోసం కష్టపడడం,
జీవిత అర్థం తెలుసుకోవడం.

ఎంత కష్టం! ఎంత కష్టం!!
పాప స్వభావమును గ్రహించడం,
రక్షకుని అవసరాన్ని కోరుకోవడం,
నిజ దేవునిని తెలుసుకోవడం.

ఎంత కష్టం! ఎంత కష్టం!!
మన పాపములను ఒప్పుకోవడం,
పరిశుద్ధముగా జీవించడం,
వాక్యమును ధ్యానించడం.

కష్టమేమీ కాదు సోదరా!
దేవుడు మనకు తోడుంటే,
సమస్తము ఇష్టమయమే.

- ఎం. హర్షవర్ధన్, గ్రాడ్యుయేట్ హెల్పర్,
మెహదీపట్నం జోన్

UESI PUBLICATIONS Since 1988

UESI PUBLICATION TRUST - TELANGANA BRANCH

Edited Printed and Published by Mr. Dasari Rajesh for UESI Publication Trust, Telangana Branch
H. No: 6 - 68/36, Jangampet Village, Jinnaram Mandal, Sangareddy District, Pin-502319
Printed at SRI RR Offset printers, Azamabad, Hyderabad.
(For Private Circulation Only)